1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబ్‌నగర్
గురువారం | అక్టోబర్ 31, 2024 | www.navatelangana.com

పకడ్బందీగా .. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

జిల్లాలో నవంబర్ 6 నుంచి నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక,ఆర్థిక,రాజకీయ కుల సర్వే) ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. బుధవారం మహ బూబ్ నగర్ పట్టణంలో మహబూబ్ నగర్ అర్బన్ మండలంకు నియ మించిన ఎన్యూమరేటర్‌లకు, సూపర్‌వైజర్‌లకు ఎంవీ.ఎస్.డిగ్రీ కళాశాలలో, మహ బూబ్‌నగర్ రూరల్ మండలంకు ఎం.పీ.డీ. ఓ కార్యాలయంలో నిర్వహి ంచిన శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 150 కుటుంబాలను ఎన్యూమ రేటర్ బ్లాక్ గా విభజించి, ఒక్కొక్క బ్లాక్‌కు ఒక ఎన్యూమ రేటర్‌ను నియమించినట్లు, పది బ్లాక్ లకు ఒక సూపర్ వైజర్ ను నియమించినట్లు తెలిపారు. అన్ని మండలం లలో ఎన్యూమ రెటర్ లకు, సూపర్ వైజర్‌లకు బుధవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్యుమారెటర్ నవంబర్ ఒకటి నుంచి 3 వరకు ఇండ్ల జాబితా రూపొందించాలని అన్నారు. నవంబర్ 6 నుంచి 18 వరకు సర్వే నిర్వహించాలని, ఈ సర్వేలో సామాజిక,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారం ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోవడానికి,సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా సర్వే పారదర్శకంగా ఉండాలని, సర్వే విషయాలను గోప్యంగా ఉంచాలని, ఎలాంటి తప్పులు లేకుండా సర్వే పక్కగా చేయాలన్నారు. వివరాల సేకరణ అనంతరం డేటా ఎంట్రీ సైతం పక్కాగా నిర్వహించాలని చెప్పారు. సర్వే సందర్భంగా అన్ని వివరాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఆర్.డీ. ఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డీ.కిషన్ రావు, రిసోర్స్ పర్సన్ బాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఉపకార వేతనాలను .. విడుదల చేయాలని ఎమ్మెల్యేకు వినతి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం మహబూబ్ నగర్ శాసన సభ సభ్యుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి యూనివర్సిటీ పరిధిలోకి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, లా కళాశాల తేవడం అభినందించారు . అదేవిధంగా మనజిల్లాకు రావాల్సిన దాదాపు రూ.1000 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడీ తేవాలని కోరారు. ఈ మధ్యకాలంలో చాలామంది దళితులు, గిరిజనులు, చదువుకోవడానికి ముందుకువస్తున్నారని అన్నారు . స్కాలర్షిప్ విడుదల కాకపోతే విద్యార్థులు చదువుకు దూరమైన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి స్కాలర్షిప్ విడుదల చేసే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షులు నందు, నాయకులు రమేష్, బన్నీ, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- పాల్గొన్న 26 పాఠశాలస్థాయి జట్లు



నవ తెలంగాణ - మహబూబ్‌నగర్

జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో బుధవారం 3వ జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ టీ-10 క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా క్రీడాపతాకాన్ని ఎగురవేసి పాఠశాల క్రీడాజట్ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి టోర్నీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయవచ్చని అన్నారు. క్రీడాటోర్నీల్లో రాణించి మీ తలిదండ్రులు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. టోర్నీ ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడా జట్ల మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మార్కెట్ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్ కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, లిటిల్ స్కాలర్స్ స్కూల్ డైరెక్టర్ సుషమ్మారాయ్, సలహాదారులు రవిచందర్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, రాష్ట్ర ట్రైబల్ వెల్ఫెర్ రిటైర్డ్ క్రీడాధికారి రమేశ్ కుమార్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, వెంకటరామారావు, సోహైల్ ఉర్ రహెమాన్, పాపారాయుడు, నర్సింలు, పీడీ బాల్ రాజు, పీఈటీలు వినోద్ కుమార్, అరుణ్, నాసర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు మరమ్మతులు

నవతెలంగాణ - జడ్చర్ల



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సహకారంతో జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంకు వెళ్లే రోడ్డు క్రిష్టారం నుంచి ఖానపూర్ వెళ్లే రోడ్డు ప్రజల రాకపో కలకు అనేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. జడ్చర్ల నుంచి నవాబ్ పేటకు ఎక్కువగా ఈ దారి గుం డానే వెళతారు. ఖానాపూర్ , కారు కొండ గ్రామాలకు నిత్యం ప్రజలు ఈ దారి గుండానే వెళ్తారు. ఇసుక టిప్పర్లు ఈ దారి గుండానే ఎక్కువగా వెళ్లడంతో రోడ్డంతా గుంతలు ఏర్పడి మోటార్ సైకిల్ కార్లు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది కలుగుతుండడంతో ఈ విషయం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఖానాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో మొరంతో గుంతలను పూడ్చి వేయించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డైట్ , కాస్మొటిక్ చార్జీల పెంపు పట్ల హర్షం

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

తెలంగాణలోని వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచడం పట్ల కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం మాణిక్యం రాజు ఎం కురుమయ్య బుధవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలోని సంక్షేమ వసతి గృహాల్లో రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ ఛార్జీలను పెంచడం పట్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగ ఉంటుందని పేర్కొన్నారు. అన్ని రకాల గురుకులాలు, పలు శాఖలకు చెందిన అనుబంధ హాస్టళ్లలో డైట్ ఛార్జీలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. 3 నుంచి 7వ తరగతి వరకు రూ.950గా ఉన్న డైట్ ఛార్జీలను రూ.1,330కి , 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1100 నుంచి రూ.1,540కి ,. ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.1,500 నుంచి రూ.2,100కి పెంచారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,65,700 మంది హాస్టల్ విద్యార్థులు ఉపయోగపడతాదన్నారు. 3 నుంచి 7వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.55గా ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను రూ.175కి పెంచారు. 8 నుంచి 10వ తరగతి వరకు రూ.75 నుంచి రూ.275కి పెంచారని తెలిపారు.

రాష్ట్రంలో పెట్టుబడుల కోసం విజ్ఞప్తి ..

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు , సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



నవ తెలంగాణ మహ బూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఐటీ మంత్రి వర్యులు శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు... అమెరికాలోని లాస్ వేగాస్ లో జరిగిన "ఐటి సర్వ్ సినర్జీ సమ్మిట్" లో తెలంగాణ రాష్ట్రం నుంచి అధికారికంగా పాల్గొన్న ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, బిటాస్క్ సీ. ఓ. ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి , ఐటీ సినర్జీ సమ్మి ట్ ప్రాంగణంలో వివిధ కంపెనీల ప్రతినిధులను కలిసి తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో తెలంగాణ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధన, స్మార్ట్ గవర్నెన్స్ కోసం తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల అమలు, ఎఐ ఇన్నోవేషన్ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ ను మార్చాలన్న తెలంగాణ ప్రజా ప్రభుత్వ ఆశయం, తెలంగాణ రాష్ట్రంలో పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ సిస్టమ్, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ-గవర్నెన్స్ కార్యకమాలు, స్కిల్ డెవలప్మెంట్, యంగ్ ఇండియా స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ లక్ష్యాలపై వివిధ కంపెనీల ప్రతినిధులతో చర్చించి, వారి నిబద్ధత, శ్రద్ధ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉపయోగపడుతుందని, తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని కోరారు.

నిర్మాణాలకు నోచుకోని..అమ్మ ఆదర్శం

- కూలుతున్న పాఠశాల భవనాలు
- ఆరుబయటే చదువులు
- అవసరం ఉన్న చోట జరగని నిర్మాణాలు
- గిరిజన మహిళా ఉద్యోగులులేని చోట రెండస్తుల భవనం
- పాఠశాలకు భవనాలు కరువు



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

మన ఊరు .. మన బడి మొదలు కొని అమ్మ ఆదర్శం దాక ప్రభుత్వ పాఠశాలను కార్పోరేటు స్థాయిలో అభివృద్ధి చేస్తామని పాలకుల మాటలు ప్రకటనలకే పరిమిత మయ్యాయి. 1945 నాటి కాలంలో బ్రిటీష్ వారు నిర్మిం చిన భవనాలలోనే నేటికీ విద్యాబోదన చేస్తున్నారు. ఇరుకు గదులు, గాలి , వెలుతురు, మౌలిక వసతులు లేక పాఠ శాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఉంచరాదని జిల్లా అధికారులే చెప్పారంటే పాఠశాలల దుస్థితి ఏ విదంగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. అవసరం లేని ప్రభుత్వ శాఖలకు పక్కా భవనాలు నిర్మించారు. అవి నేడు నిరుపయోగకరంగా మారాయి. భావీభారత నిర్మాతలైన విద్యార్థులు చదివే పాఠశాలలు మాత్రం లోప భూయిష్టంగా మారాయి. కొన్ని పాఠశాలల్లో గదులు లేక ఉపాధ్యాయులు ఆరబయటనే విద్యార్థులను కూర్చోబెట్టి బోధిస్తున్నారు. అమ్మ ఆదర్శం ద్వారా కొత్త భవనాలు నిర్మించి ఇవ్వాలని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ ఆదర్శపాఠశాలను మౌళిక వసతుల రూపకల్పన చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారు. గత పాలకులు మన ఊరు.. మన బడి ద్వారా గోడలకు సున్నం వేశారు తప్పా మౌళిక వసతుల కల్పన మరిచారు. నేటిపాలకలు తీసుకొచ్చిన ఆదర్శ పాఠ శాలలను ప్రకటన చేశారు తప్పా పక్క భవనాలపై దృష్టి సారించడం లేదు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఎదిర గ్రామంలో ఉన్నత పాఠశాల ఉంది. 1945లో బ్రీటీష్ కాలంలో ఊర్దూ మీడియంతో ఇక్కడ ప్రాధమిక పాఠశాలను మొదలు పెట్టారు. ఆతర్వాత అంచెలంచలుగా ప్రాధమికోన్నత, ఉన్నత పాఠశాల వరకు స్థాయి పెంచారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 175 మంది విద్యార్థులు ఉన్నారు.బాలురు 99 మంది బాలికలు 76 మంది ఉన్నారు. ఇక్కడ ఆరవ తరగతి నుంచి ఇంగ్లీష్ బోధన చేస్తున్నారు. ఏడు మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో ఒకరు బయోసైన్స్ బోధించే ఉపాధ్యాయులు డీఈఓ పరిధిలో పనిచేస్తున్నారు. దీంతో సైన్స్ పాఠ్యాంశం అర్థం చేసుకునే విషయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రీటీష్ కాలం నుంచి నడుస్తున్న ఈ పాఠశాలను మారుతున్న కాలానుగుణంగా అభివృద్ధి చేస్తున్నారు. పాఠశాల గదుల నిర్మాణ విషయంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇరుకు గదులు, గాలి , వెలుతురు సైతం ఉండటం లేదు. విశాలమైన గదులు అయితే విద్యార్థుల చదువు చక్కగా కొనసాగుతుంది. ఇప్పటికైనా పాఠశాల గదులను నిర్మించి చదువు చక్కగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఎదిర వార్డులో గిరిజన మహిళా ఉద్యోగుల కోసం రూ.రెండు కోట్లు ఖర్చు చేసి మూడు అంతస్తుల భవనాలను నిర్మించారు. ఇక్కడ గిరిజన మహిళా ఉద్యోగులు ఆస్థాయిలో లేరు. అయినా కోట్లు వెచ్చించి నిర్మాణం చేశారు. రెండేళ్లుగా వృథాగా ఉంది. దీని లో పాఠశాలను నిర్వహిస్తే.. విద్యార్థుల చదువు సవ్యంగా సాగుతుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 679 ప్రాథమిక 195 ప్రాథమికోన్నత, 287 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లాలో 638 ప్రాథమిక, 218 ప్రాథమికోన్నత, 236 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వనపర్తి జిల్లాలో 370 ప్రాథమిక, 130 ప్రాథమికోన్నత, 192 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గద్వాల జిల్లాలో 294 ప్రాథ మిక, 144 ప్రాథమికోన్నత, 154 ప్రాథమికోన్నత పాఠ శాలలు ఉన్నాయి. నారాయణపేట జిల్లాలో 359 ప్రాథమిక, 152 ప్రామికోన్నత, 139 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా పూరాతనమైనవిగా ఉన్నాయి.

మౌళిక వసతులు కల్పించాలి..



ప్రభుత్వ పాఠశాలలు అనేక పురాతన కాలంలోనే నిర్మించారు. వీటికి మౌళిక వసతులు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కొత్తభవనాలు ఏర్పాటు చేయాలి. కొత్త పథకాలు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. అదే క్రమంలో మౌళిక వసతులతో పాటు పాఠశాల భవన నిర్మా ణాలు ఏర్పాటు చేయాలి.

- ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

విశాలభవనం నిర్మాణం చేయాలి..



పురాత కాలంలో నిర్మించిన భవనం కావడం చేత అసౌకర్యంగా ఉంది. గాలి, వెలుతురు రావడం కష్టంగా ఉంది. విద్యా ర్థులకు విశాల భవనం అయితే విద్యా బోధన చక్కగా సాగుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పక్కా భవనం నిర్మించాలి.

- హేమచంద్రుడు, ప్రదానోపాద్యాయులు, ఎదిర, మహబూబ్‌నగర్ జిల్లా

వరి, పత్తికి మద్దతు ధర, బోనస్ ఇవ్వాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు టీ. సాగర్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వరి, పత్తికి మద్దతు ధర , బోనస్ ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యాల యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హాజరై మాట్లాడుతూ పత్తి మార్కెట్లలో దోపిడీని అరికట్టి , కనీసం మద్దతు ధర , బోనస్ అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని ,రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ కింద క్వింటాల్‌కు రూ. 470లు బోనస్ ఇవ్వాలని ,వడ్లకు మద్దతుధర ఇచ్చి బోనస్ అమలుపరచాలని డిమాండ్ చేశారు. పత్తి , వరిని మధ్య దళారులు రైతులతో తక్కువ కొని,ఎక్కువ ధరలకు మార్కెట్లో ధరలకు అమ్ముతున్నారని, ప్రభుత్వం స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం .. రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధరలను నిర్ణయించిందని అన్నారు. పత్తికి మద్దతు ధర రూ.7,521 ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్ ధరలను బట్టి అమ్మకాలు జరగాలన్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధర కొనసాగుతుందని , తెలంగాణలో పత్తికి రూ.6,7వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి విస్తృతంగా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, వరికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. రాములు మాట్లాడుతూ సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు నవంబర్ 8, 9 తేదీల్లో జడ్చర్ల పట్టణంలో జరగబోతున్నాయని, మహాసభల జయప్రదానికి ఆహ్వాన సంఘం ఏర్పడి మహాసభ జయప్రదం చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ మహాసభల్లో ప్రత్యేకంగా ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం జరిగే రకంగా, కరివేనా ఉదండాపూర్ ప్రాజెక్ట్ లను సత్వరమే పూర్తి చేయాలని తీర్మానం చేయబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా తక్షణం చెల్లించాలని, ఇండస్ట్రియల్ ఏరియాలో వలస కార్మికుల సమస్యలు, పారిశ్రామిక కార్మికుల సమస్యలను చర్చించి భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు కిల్లే గోపాల్ , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి, బీ. చంద్రకాంత్, పద్మ, సత్తయ్య ,జగన్ ,దీప్లా ప్రశాంత్ , భరత్ , రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పోలీసులు చిత్రహింసలు : మాజీ మంత్రి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పోలీసులు మా కార్యకర్తలను పోలీస్టేషన్లకు పిలిపించి చిత్రహింసలు పెడుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బుధవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని పార్టీ నాయకుడు వర్ధ భాస్కర్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మొదటి పట్టణ సీఐ కొట్టాడని, సామజిక మాధ్యమాల్లో ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టినందుకు సీఐ అప్పయ్య స్టేషన్‌లో భూతులు తిడుతూ కొట్టారని బాధితుడు వర్ధ భాస్కర్ తెలిపారని మాజీ మంత్రి తెలిపారు. చట్ట పరిధిలో పని చేయాల్సిన అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా పని చేసి పోలీస్ వ్యవస్థకి చెడ్డపేరు తీసుకువస్తున్నారని అన్నారు. సామజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే ఏదైనా సమస్య వస్తే పిలిచి మాట్లాడాలని.. ఇష్టం వచ్చినట్టు కొడితే ఎలా అని ప్రశ్నించారు. అతనికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సీఐ ని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలో వస్తుందని.. చట్టాన్ని అతిక్రమించి పని చేసిన అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వర్ధ భాస్కర్‌ని సీఐ కొట్టిన ఘటనపై న్యాయపరంగా ముందుకు వెళ్తామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నేతలు ఆందోళన విరమించారు. నిరసన కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఆంజనేయులు, రవి, బీసీ కమిషన్ మాజీసభ్యులు రాజుసాగర్, కిషోర్, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీయూను మొదటి స్థానంలో నిలుపడమే లక్ష్యం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

పాలమూరు విశ్వవిద్యాలయంను అన్ని విభాగాలు, రంగాలలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం యూనివర్సిటీకి అనుబంధంగా ఇంజినీరింగ్ , లా కాలేజీలు మంజూరైన సందర్భంగా ముఖ్యమంత్రి అభినందన సభ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించారు. పీసీసీ కార్యదర్శి వినోద్ కుమార్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి నింపిన పాలమూరు యూనివర్సిటీ, ఇప్పుడు విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపుతోందని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంజినీరింగ్ , లా కళాశాల తరగతులు ప్రారంభమవుతున్నట్లు వెల్లడించారు. పాలమూరు యూనివర్సిటీకి నాకు తల్లిబిడ్డకు ఉన్న పేగుబంధం అని, 2012లో తెలంగాణ ఉద్యమంఉవ్వెత్తున ఎగసిపడుతున్న వేళ నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న పాలమూరు యూనివర్సిటీకి నిధులు మంజూరు విషయంలో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని యూని వర్సిటీకి రప్పించే ప్రయత్నం లో ఇక్కడున్న విద్యార్థులు, యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి కూలంకుషంగా చర్చించి సంవత్సరంలో 364 రోజులు ఉద్యమం చెద్దాం కానీ, ఒక్క రోజు ఉద్యమం ఆపి ముఖ్యమంత్రికి సహకరిస్తే, మన యునివర్సిటీకి నిధులు మంజూరు చేసుకొనే అవకాశం ఉంటుందని ఒప్పించి, ముఖ్యమంత్రి సభలో ఎలాంటి అలజడి చేరకుండా చాలా క్రమశిక్షణతో నాటిసభను విజయవంతం చేసినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఆ రోజు ఎంతో విలువైన రూ.18 కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేసినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇదే యునివర్సిటీలో మీ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రముఖ ఐటీఐలతో టై అప్ అయ్యి పాలమూరు యూనివర్సిటీని ప్రపంచంలోనేప్రఖ్యాత విశ్వవిద్యాలయంగా రూపొందిం చుకొందామని , ఎన్నో కొత్త కొత్త ఆవిష్కరణలకు పాలమూరు యూనివర్సిటీ చిరునామాగా మార్చుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి,

వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీఎన్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు

వినోద్ కుమార్, ఎన్‌పీ వెంకటేష్, సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మారేపల్లి సురేందర్ రెడ్డి, రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, పురపాలక కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాలమూరు యూనివర్సిటీ టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా.. మలుపు రోడ్డు

- పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్
- పొంచి ఉన్న ప్రమాదం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు



నవతెలంగాణ- బాలానగర్

బాలానగర్ మండలంలోని ఊడిత్యాల గ్రామంలో బస్టాండు కూడలివద్ద మలుపు రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడు తున్న పరిస్థితి నెలకొంది.బాలానగర్ జాతీయ రహదారి నుంచి ఈరన్న పల్లితండా వరకు రూ. 11 కోట్ల యాభై లక్షల విలువ చేసే డబల్ రోడ్డు పనులు ప్రారంభమై మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామాలలో సీసీరోడ్డు వేయటానికి కాంట్రాక్టర్ వదిలేశారని, ఈ మూల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సీసీరోడ్డు నిర్మాణం చేయలేకపోయారు. ఈ దారి గుండా షాద్‌నగర్ డిపో నుంచి నవబ్‌పేట మండలం వరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు నడుస్తున్నాయి. భారీ ఇతర వాహనాలు ఈ దారి గుండా వెళుతుంటాయి. ఒక వాహనం వస్తుందంటే మరొక వాహనం అరగంట ఆగా ల్సిందే పక్కనే గీతాంజలి స్కూల్ ఉన్నది. వాహన దారులు అతివేగంగా వాహనాలు వెళ్లడంతో పలు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ కూడాలి వద్ద తక్షణమే మరవద్దు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వేసిన డబుల్ రోడ్డు గుంతల మయంకావడంతో పలు ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టి ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

జేఎన్‌టీయూలో మౌలిక వసతుల కల్పనకు కృషి : కలెక్టర్



నవతెలంగాణ- వనపర్తి రూరల్

వనపర్తి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ అండ్ చీఫ్ ఇంజనీర్ వేంకటేశ్వరరెడ్డి కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల్లో 2022లో ప్రారంభమైన ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరైనా నిధులు ఇంకా విడుదల కాలేదని దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేకపోతున్నామని కలెక్టర్‌కు వివరించారు. అందుకు కలెక్టర్ మాట్లాడుతూ ఫైల్ వివరాలు ఇవ్వాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.ఎస్. రాజు, వైస్ ప్రిన్సిపాల్ రామ్ నరేష్ పాల్గొన్నారు.

దీపావళిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోండి

- ఎస్పీ రావుల గిరిధర్



నవతెలంగాణ-వనపర్తి రూరల్

వనపర్తి జిల్లా ప్రజలు దీపావళి పండుగను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా పిల్లలు పెద్దలు తేడా లేకుండా టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. టపాసులు కాల్చేటప్పుడు పిల్లలపై పెద్దలు నిఘా ఉంచాలని ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉంటాయపేర్కొన్నారు. జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పోరాటాలు ఉధృతం చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ
- ఘనంగా అమరచింత మండల మహాసభలు

నవతెలంగాణ-ఆత్మకూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉధృతం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. బుధవారం మస్తీపూర్ క్రాస్‌రోడ్‌లోని ఫంక్షన్‌హాల్‌లో అమరచింత సీపీఐ (ఎం) మండల3వ మహాసభలు నిర్వహించారు. ఆర్.ఎన్.రమేష్, బీ.వెంకటేష్, అనంతమ్మ అధ్యతన జరిగిన మహాసభలకు జాన్‌వెస్లీ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సీపీఎం సీనియర్ నాయకుడు ఏండీ. మహమూద్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏస్.అజయ్ సంతాప తీర్మాణం ప్రవేశ పెట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు తమ చివరి శ్వాస వరకు దోపిడీ పీడన నుంచి పీడిత ప్రజలను విముక్తి చేసేంత వరకు పోరాడాలని పిలుపు ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర పాలకు లు ప్రజా సమస్యల పరిష్కరించకుండా ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారన్నారు. కుల,మత ప్రాంతాలతో సంబంధం లేకుండా అణగారిన వర్గాలను దోపిడీ పీడన నుంచి విముక్తి చేయడానికి ప్రతి కార్యకర్త పోరాడాలని అన్నారు. పాలకులు ఎవరు అధికారంలోకి వచ్చినా తమ పెట్టుబడి దారి పంథాను మార్చుకోరని, వ్యవస్థలో అసమానతలు ఉండాలని కోరుకోవడం పెట్టుబడిదారీ విధానం సహజ లక్షణమన్నారు. సీపీఎం కార్యకర్తలు మతోన్మాదాన్ని, ఆర్థిక సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా రెండింటిని మేళవించి పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. నిర్బంధాలు ఆటంకాలు ఎన్ని ఎదురైనా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త అకుంఠిత దీక్షతో పనిచేయాలలన్నారు. గత దశాబ్ద కాలంలో బీజేపీ పాలనలో చట్టబద్ధ, రాజ్యాంగ బద్ధ సంస్థలు నిర్వీర్య మయ్యాయని, అన్ని వ్యవస్థల్లోకి రాజకీయ జోక్యం పెరిగి విజ్ఞాన శాస్త్రం వెనకకు వెళుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉత్పత్తిదారు ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశాన్ని దిగుమతులపై ఆధారపడి వినియోగదారి ఆర్థిక వ్యవస్థగా మార్చారని విమర్శించారు. ఐక్యరాజ్యసమితి సహ అనేక అంతర్జాతీయ సంస్థలు దేశతిరోగమనాన్ని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్న బీజేపీ పాలకులు నిరంకుశంతో ముందుకు వెళ్తున్నారని విమర్శించారు. దేశ సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తూ పాలన కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. బీజేపీ విధానాలపై ప్రాంతీయ పార్టీలు మేలుకొనకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వర్తమాన ప్రపంచానికి కమ్యూనిస్టు పార్టీల అవసరం ఉందని అధికారంలో ఉన్నా లేకున్నా పీడిత ప్రజల వైపు పోరాడేది ఎర్రజెండా లేనని అన్నారు. కమ్యూనిస్టులు బలహీన పడటం అంటే పీడిత ప్రజల తమ ప్రశ్నించే హక్కును కోల్పోవడమేనని, అంతరాలలేని సమాజం కోసం నిరంతరం పరితపిస్తున్న కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రజలు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రాజు, మండల నాయకులు ఏ.బుచ్చన్న, శ్యామ్‌సుందర్, టి.గోపాల్, బేక్కం విష్ణు, టి.రాఘవేంద్ర, డి.నర్సింహా, పీఎన్ఎం కళాకారులు వెంకటేష్, ఎస్‌సి. అరుణ్ సుజ్ఞానం, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



మహాసభలకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

వరి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

నవతెలంగాణ- వనపర్తి రూరల్

వరి కొనుగోళ్ల పకడ్బందీగా, పారదర్శకంగా జరగాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వరి కొనుగోలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వరి నిర్దేశించిన మిల్లు లేదా గోదాంకు మాత్రమే వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వానాకాలం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక నిర్దిష్టమైన గుర్తింపు సంఖ్య ఇవ్వాలని అదే విధంగా కొనుగోలు కేంద్రంలో వచ్చిన ధాన్యపు బస్తాలపై గుర్తింపు సంఖ్య ముద్రవేయాలని ఆయన సూచించారు. పౌర సరఫరాల శాఖ ద్వారా కొనుగోలు కేంద్రం నుండి కేటాయించిన మిల్లుకు గాని గోదాంకు గాని మాత్రమే ధాన్యం తరలించాలని అలా కాకుండా కొనుగోలు కేంద్రం నుండి తమకు ఇష్టమొచ్చిన మిల్లులకు ధాన్యం తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని తేమ యంత్రాలు, తూకం యంత్రాలు అందుబాటులో ఉండాలని సూచించారు. దొడ్డు రకం ధాన్యం తమ శాతం 17, సన్న రకం అయితే 14 శాతం తేమ కలిగి ఉండాలని సూచించారు. పంట కోతల ప్రారంభం కాగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి. వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, మార్కెటింగ్ శాఖ అధికారి స్వరణ్ సింగ్, డీఎం. ఇర్ఫాన్, డీపీఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి

- తాసిల్దార్ వరలక్ష్మి



బాలయ్య దంపతులను సన్మానిస్తున్న తాసీల్దార్, సిబ్బంది

నవతెలంగాణ -వీపనగండ్ల

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని తాసిల్దార్ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో అటెండర్ బాలయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలయ్య కావలికారీగా, అటెండర్‌గా 36 సంవత్సరాలు అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో కుటుంబంతో సంతోషంగా గడపాలన్నారు. అనంతరం అటెండర్ బాలయ్య పార్వతమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాన్‌గల్ తాసీల్దార్ ఇక్బాల్, డిప్యూటీ తాసీల్దార్లు కృష్ణమూర్తి, శ్రీనివాసులు, ఉండవెల్లి డిప్యూటీ తాసీల్దార్ రజని, జూనియర్ అసిస్టెంట్ రాఘ వేందర్, ఆర్ఐ కురుమూర్తి మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి, అమ్మాయిపల్లి మాజీ సర్పంచ్ జయగౌడ్, అధికారులు రాజేంద్రప్రసాద్, శ్రీను, కురుమూర్తి, కార్యాలయ సిబ్బంది దశరథం, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులే



మైనొద్దీన్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ -పెబ్బేరు

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులేనని ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయుడు మైనుద్దీన్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుల సేవలను సమాజం గుర్తుం చుకుంటుందన్నారు. మైనుద్దీన్ విద్యారంగానికి 26 సంవత్సరాలు సేవలందించారన్నారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఆ స్కూల్‌ను మోడల్ స్కూల్ గా తీర్చిదిద్దడంతో పాటు ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు మైనొద్దీన్‌ను ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు,స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ నర్సింగరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, చంద్రశేఖర్, గణేష్‌కుమార్, బొద్దారెడ్డి, డి.కృష్ణయ్య, సూర చంద్రశేఖర్, శ్రీనివాసరావు, హరిప్రసాద్,విష్ణు వర్ధన్, మురళీ కృష్ణ, నరేందర్‌రెడ్డి, తిప్పాయపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పెబ్బేర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, బాబురెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ -పెబ్బేరు

పెబ్బేరు మోడల్‌స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభకనబర్చి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నరేష్ తెలిపారు. అండర్ 17 కబడ్డీ విభాగంలో విద్యార్థులు శ్రీకాంత్, శ్రావణి, అండర్ 17 కోకో విభాగంలో శివ ఎంపికయ్యారన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం ప్రిన్సిపాల్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ చిన్నగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ కమలాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆర్పీలకు వేతనాలను పెంచాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్

నవతెలంగాణ-మదనాపురం

జీవో నెంబర్ 60 ప్రకారంగా ఆర్పిలకు నెలకు రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్పీలు కొత్తకోట మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశినికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆర్పీలు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతున్నారని, పని మాత్రం అధికంగా ఉన్నా వేతనాలు మాత్రం చాలా తక్కువ ఇస్తున్నారన్నారు. రోజువారీగా నిత్యవసర వస్తువుల ధరలు పెరుగు తున్నాయని, ఏమి కొనేటట్టు, తినేటట్టు లేదు అన్న చందంగా ఉందన్నారు. ఆర్పీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం, యూనిఫామ్ కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వము ఆర్పిలను గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్పీల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 1వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా ఉంటుందని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లావణ్య, జలజ, యాస్మిన్, పద్మ, స్వప్న లక్ష్మీ సౌజన్య, సోనీ, సుజాత, అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆర్పీలు



వనపర్తిలో వినతి పత్రం అందజేస్తున్న ఆర్పీలు

సమస్యలను పరిష్కరించాలి

వనపర్తి రూరల్ : ఆర్పిల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం తెలంగాణ ఆర్పీ యూనియన్ వనపర్తి కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ బాలరాజులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడుతూ జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలను పెంచాలని, ఆర్పిలకు గుర్తింపు కార్డులు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సాధారణ బీమా రూ.10 లక్షల ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా ఒకే డ్రెస్ కోడ్ అమలు చేయాలని వ్యక్తి గత బ్యాంకు ఖాతాల్లో ఆర్పీల వేతనాలను జమ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం వనపర్తి పట్టణ నాయకులు గోపమ్మ, బషీరాబాద్ మంజుల, శ్రీలక్ష్మి, ఎం.జయమ్మ ఏ.కల్పన, వీ. రేణుక, రాజ్యలక్ష్మి, కళావతి, శారద, స్వర్ణలత, సుజాత, మాలతి, సువర్ణ, సఫియా తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ - మదనాపురం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వికలాంగులకు నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ భీమా ప్రభాకర్‌శెట్టి అన్నారు. బుధవారం మదనాపురం మండల కేంద్రంలో నిర్వహించిన వికలాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు పింఛన్ రూ.4,016 నుంచి రూ.6,016 అందజేస్తా మని చెప్పి అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయక పోవడం విడ్డూరమన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే నవంబర్‌లో సమావేశాలు నిర్వహించుకుని దీక్షలు, ధర్నాలు చేపడ్తామని హెచ్చరించారు. అదేవిదంగా మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఇందిరా పార్క్ దగ్గర జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా నాగరాజు, కో కన్వీనర్‌గా నాగేశ్వర్‌రెడ్డి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

నవతెలంగాణ- మదనపురం



వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మదనపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి తెలిపారు. అండర్ 17 కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు కావ్యశ్రీ ,రాధిక, అనిత పాల్గొని ప్రతిభ కనబర్చి నట్లు తెలిపారు. విద్యార్థిని కావ్యశ్రీ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఎన్నికైందన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను మండల విద్యాధికారి ఫారుక్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, ఉపాధ్యాయులు మహేందర్ గౌడ్, సుదర్శన్, రంగయ్య, ఈశ్వర్ లాల్, వెంకటేష్ ,వెంకటస్వామి, శిరీష, భారతి, రామకృష్ణ, ప్రసాద్, దేవా, వ్యాయామ ఉపాధ్యాయుడు రామ్మోహన్ అభినందించారు.

వ్యవసాయ మార్కెట్‌ను
సందర్శించిన రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ -వనపర్తి రూరల్

రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరచారి బుధవారం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల మార్కెట్లో ఉన్న రేటు వనపర్తి మార్కెట్లో ఎందుకు ఉండలేదని ఆయన ప్రశ్నించారు . అధికారులు స్పందించి మార్కెట్లలో ఏ గ్రేడ్ బి గ్రేడ్ ఏబి అనే దానిని ఓపెన్ గా మైక్‌లో ప్రకటించాలని లేదా మార్కెట్ బోర్డు పైన రాయాలన్నారు. వేరుశనగకు ప్రభుత్వం కనీసం మద్దతు ధర క్వింటాలకు రూ. 10వేలు ఇవ్వాల డిమాండ్ చేశారు. మార్కెట్లో రైతులకు రూ.5 భోజనం, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట రైతుల బుజ్జన్న, వెంకటస్వామి, సహదేవుడు, సక్రు నాయక్, జగదీశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, స్వామి తదితరులు ఉన్నారు.

చరిత్రను వక్రీకరించొద్దు : కాంగ్రెస్

నవతెలంగాణ -వనపర్తి రూరల్

వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, కౌన్సిలర్ వెంకటేష్, సమన్వయకర్త లక్కాకుల సతీష్ మాట్లాడుతూ కేసీఆర్ దయతో తెలంగాణ సాధ్యమైందని మాజీ మంత్రి అనడం సరైనది కాదని చరిత్రను వక్రీకరించి మాట్లాడడం తగదన్నారు. ఎంతో మంది విద్యార్థి ప్రాణ త్యాగాలు, ఉద్యోగ సంఘాల ఉద్యమాలతో వచ్చిన తెలంగాణను కేసీఆర్ ద్వారా వచ్చిందనడం సరికాదన్నారు. చట్టసభలలో సోనియా గాంధీ ద్వారానే తెలంగాణ రావడం జరిగిందని కేసీఆర్ అన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ఎక్కడి నుంచో వచ్చినవారు సన్యాసులు అని మాట్లాడడం మాజీ మంత్రికి తగదన్నారు. ఉపాధి ఉద్యోగాలు మేమే కల్పించామని మాజీ మంత్రి అంటున్నారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో తెలపాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతు రుణ మాఫీ ఎందుకు చేయలేదని వారు ప్రశ్నించారు. వచ్చిన కొన్ని రోజులలోనే 23 లక్షల మందికి రుణమాఫీ చేసిందన్నారు. అభివృద్ధి, నిధులను గోల్మాల్‌పై చర్చకు మేము సిద్ధమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల పంచాయతీ అధికారి

నవతెలంగాణ-ఆత్మకూరు


ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేపై నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేలో నమోదు చేయాల్సిన అంశాలపై మండల పంచాయతీ అధికారి శ్రీరామ్‌రెడ్డి నిర్వాహకులకు వివరాంచారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సుజాత, మండల రెవెన్యూ అధికారి షేక్ చాంద్‌పాషా, మండల విద్యాధికారి బాలరాజు, మండల వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, సర్వే నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

నవతెలంగాణ- ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చినహామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకురు ను రెవెన్యూ డివిజన్ చేస్తామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మాట ఇచ్చారన్నారు. ఇటీవల ప్రభుత్వం ఏటూరు నాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి ఆత్మకూరును రెవెన్యూ డివిజన్‌గా ఎందుకు ప్రకటించలేదని ఆయన ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అదేవిధంగా మున్సిపాలిటీలో జరిగిన అవకతవకలు వెలికి తీసి బాధ్యులపై చర్యలు తీసు కోవడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందే బాలయ్య, మక్తల్ పట్టణ అధ్యక్షుడు కనకరాజు, ఆత్మకూరు మండల నాయకులు అశ్విని కుమార్, అనిల్ కుమార్ గౌడ్, ఆనంద్, శివ, బాలకృష్ణ, సమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు మున్సిపాలిటీలో జరిగిన అవక తవకలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర గౌడ సంఘం చైర్మన్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలి టిలోని 10 శాతం ప్రభుత్వ భూమి, సివిల్ సప్లై భూములు, చెరువుకు సంబం ధించిన భూముల ఆక్రమణకు గురయ్యాయన్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి గంగాధర్ గౌడ్, జిల్లా కార్యదర్శి అయూబ్ ఖాన్, మండల నాయకులు చికెన్ వెంకటన్న, మనివర్ధన్‌రెడ్డి, నాగేశ్, రఫిక్, పరమేష్, రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బాధితకుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ -వీపనగండ్ల



ఉమ్మడి వీపనగండ్ల మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దిలేటి యాదవ్ దశదినకర్మ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొత్త కళ్యాణ్ కుమార్ ఆయన కుమారుడు సురేందర్ మద్దిలేటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ చిన్నంబావి మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, అయ్యవారిపల్లి మాజీ సర్పంచ్ తిరుపతయ్య యాదవ్, రమేష్, ఆకుల వెంక టేశ్వర్లు, ప్రకాష్ తదితరు లు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
గురువారం | అక్టోబర్ 31, 2024 | www.navatelangana.com



ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో.. రాజకీయ జోక్యం తగదు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు

నవతెలంగాణ - తెలకపల్లి

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతి పేదోడికి ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవారం తెలకపల్లి మండల పార్టీ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న హామీలు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 9 గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ మాట నీటిమూటగా మిగిలిందన్నారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ద్వారా ప్రతి పేదోడి సొంతింటి కల నెరవేరుస్తామన్న ముఖ్యమంత్రి హామీ ఇంతవరకు అమలు చేయడం లేదన్నారు. ఇందిరమ్మ కమిటీలు రాజకీయాలకతీతంగా వేయాలన్న నిబంధనను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. గత పాలకులు అప్రజాస్వామిక విధానాలను అమలు చేయడం వల్లే ఓడించారని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదేబాటలో పయనిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, విజయ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-బిజినేపల్లి



మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా వైద్యాధి కారి స్వరాజ్యలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో వ్యాక్సిన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని లేదంటే తగిన చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాణి ఇందిరా దేవి హై స్కూల్ శతోత్సవ సంబరాలను విజయవంతం చేయండి

- రత్నగిరి ఫౌండేషన్ అధినేత జూపల్లి జగన్మోహన్ రావు

నవతెలంగాణ- కొల్లాపూర్ రూరల్

రాణి ఇందిరా దేవి హైస్కూల్ శతోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని రత్నగిరి ఫౌండేషన్ అధినేత జూపల్లి జగన్మోహన్‌రావు కోరారు. కొల్లాపూర్ మండల కేంద్రంలో గల రాణి ఇందిరా దేవి హై స్కూల్ శతోత్సవ సంబరాలు నవంబర్ 27, 28, 29 తేదీలలో వైభవంగా జరపాలని విలేకరుల సమావేశంలో జూపల్లి జగన్మోహన్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాణి ఇందిరా దేవి హై స్కూల్ ప్రతిష్టను దేశనలు దిశల వ్యాపింప చేయడానికి ఆర్ఐడీ విద్యార్థులే కాకుండా ఇతర విద్యార్థులు కూడా దేశ విదేశాల్లో ఎక్కడ ఉన్నా, ఏ రాష్ట్రంలో ఉన్న, ఏ రంగంలో ఉన్న కొల్లాపూర్ ప్రతిష్టను కాపాడుకోవడంలో భాగంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని ఈ శతోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొల్లాపూర్ శమీ వృక్ష అభివృద్ధి కమిటీ సభ్యులు రామచంద్ర రావు, సురేందర్ సింగ్, బోరెల్లి మహేష్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 హాకీ జట్టుకు శ్రావణి ఎంపిక

నవతెలంగాణ-కందనూలు



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా హాకీ సెలక్షన్లలో బుధవారం వనపర్తిలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన హాకీ సెలక్షన్లలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు స్థానిక సీఎంఆర్ తొమ్మిదవ తరగతి విద్యార్థిని జి.శ్రావణి ఎంపికై నవంబర్‌లో నిజామాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ బాలికల జట్టుకు ఉమ్మడి జిల్లా జట్టు నుండి శ్రావణి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఫౌండర్ సి.భాస్కర రావు, చంద్రకళ, ప్రిన్సిపాల్ నరసింహమూర్తి, పాఠశాల యాజమాన్యం ఫసీ యొద్దీన్, వెంక టేశ్వరరావు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కందనూలు



నాగర్‌కర్నూల్ జిల్లా జనవిజ్ఞాన వేదిక బృందం వారు నవంబరు-2024లో జరగబోయే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ని అడిషనల్ కలెక్టర్ దేవసహాయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ టెంపర్‌ని చిన్నతనం నుంచే పిల్లల్లో నింపడంలో జనవిజ్ఞాన వేదిక కృషి అభినందనీయమనీ ప్రతీ పాఠశాలలో జయప్రదం చేసే విధంగా డీఈవోల చే ఉత్తర్వులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఏటూరి రామక్రిష్ణ, కొల్లాపూర్ మొహమ్మద్, కొత్త కర్నాకర్ రెడ్డి, రమణ, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్

నవతెలంగాణ-కందనూలు

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీనాచారి భవన్‌లో బుధవారం నిర్వహించిన ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహారాష్ట్ర, నాగపూర్ పట్టణంలో 1920 అక్టోబర్, 31న ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, దాంగట్ల వెంకటస్వామి, రాజు, గోర్ల సత్యం, జీవన్, కృష్ణ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విద్యార్థి

నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి



ఈనెల 28న దేవుని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పిల్లి చంద్రమ్మ తన బిడ్డ గ్రామమైన కల్వకోల్‌కు వెళ్లి అక్కడ పొరపాటున తన 2 తులాల 3 మాసల బంగారు నాను పోగొట్టుకున్నదని సీఐ మహేష్ తెలిపారు. ఈ విషయాన్ని అదేరోజు పిల్లి చంద్రమ్మ ఫిర్యాదు చేసిందని ఫిర్యాదు మేరకు ఎంక్వయిరీ చేయగా 29న ఉదయం 9గంటల సమయంలో కల్వకోల్ గ్రామానికి చెందిన విద్యార్థి చెంచేటి సాయికుమార్ తండ్రి సత్యంకు దొరికిందని, ఆ బంగారాన్ని తన తండ్రి అయిన సత్యంకు తెలుపగా నిజాయితీతో తన తండ్రితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. వీరి నిజాయితీని మెచ్చుకొని నిజాయితీతో తనకు దొరికిన బంగారాన్ని అప్పగించిన విద్యార్థిని కొల్లాపూర్ సీఐ మహేష్, ఎస్సై సతీష్ సత్కరించి, కొత్త బట్టలు, షూ ఇప్పించి అభినందించారు.

నవంబర్ 6న ఉచిత కంటి శిబిరం

నవతెలంగాణ-కందనూలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో నవంబర్ 6న ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూలు ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గది నెంబర్ 102లో కంటి శిబిరం ఉదయం 9నుండి 11గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి, అందులో అవసరమైన వారికి, క్యాటరాక్టు పొర గల వారికి ఉచితంగా మహబూబ్‌నగర్ ఏనుగొండ లయన్ రామ్ రెడ్డి కంటి ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోగులకు ప్రత్యేక అంబులెన్స్ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. రోగులు ముందుగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకొని, రిపోర్టు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఈ ప్రాంత రోగులు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డు జిరాక్స్ కాపీ, ఫోన్ నెంబర్‌ని తమ వెంట తెచ్చుకోవాలని, 9440876556, 7386940480లో సంప్రదించాలన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ - బల్మూరు



చిన్ననాటి స్నేహితుడు యొక్క తండ్రి అనారోగ్యంతో మరణించడంతో అతని కుటుంబానికి మిత్రులు ఆర్థిక సహాయం అందించారు. ఇందుకు సంబంధించి మిత్రులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొండనాగుల గ్రామానికి చెందిన చెక్కల రాములు మా మిత్రుడు అయిన శ్యామ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించాడని తెలిపారు. వారి కుటుంబానికి చిన్ననాటి మిత్రులుగా తమవంతు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. మా మిత్రుడికి తోటి స్నేహితులు అండగా నిలిచామన్నారు. దశదినకర్మ సందర్భంగా 2013 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి మిత్రులు అందరూ కలిసి రూ.10,800 ఆర్థిక సహాయం అందించి తోడుగా నిలిచామన్నారు. కష్టకాలంలో ఉన్న మిత్రులకు ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ భరోసా కల్పించామన్నారు. మా మిత్రునికి హృదయపూర్వకమైన భరోసా ఇచ్చామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి బాలరాజు, మల్లేష్ యాదవ్, ఉదయ్, ఉమాశంకర్, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

రైతులకు నష్టాన్ని మిగిలించిన పత్తి పంట

- రెండు కోతలకే ఎండిపోతున్న పత్తి పంట
- అయోమయంలో అన్నదాతలు..!

నవతెలంగాణ-కల్వకుర్తి



ఈ ఏడాది రైతులకు పత్తిపంట తీరని నష్టాన్ని మిగిలించింది. వర్షాకాలం ప్రారంభం జూన్, జూలై మాసంలో ఆశించినస్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల పత్తిపంట ఎదుగుదల పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయిందని పత్తి రైతులు వాపోయారు. పత్తిపంట సాగు చేస్తే కచ్చితంగా దాదాపు ఎనిమిది నుంచి పదిసార్లు పత్తి కోసేవారు. ఈ ఏడాది అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. ఒకటి రెండు సార్లు కోతకే పత్తిపంట పూర్తిగా ఎండిపోతుందని వివిధ గ్రామాల రైతులు తెలిపారు.

కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి ఏడాది పత్తిపంట పెద్ద మొత్తంలో సాగు చేస్తూ వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎక్కడ లేని విధంగా ఈ ప్రాంతంలో మెట్ట పొలాలు అధికంగా ఉండడం వల్ల పత్తిపంట సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది సైతం పెద్ద మొత్తంలో పత్తిపంట సాగు చేసినప్పటికీ వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులకు దిగుబడి రాకపోవడంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోయారు.

- సగానికి సగం తగ్గిన పత్తి పంట దిగుబడి..

ఈ ఏడాది పత్తిపంట దిగుబడి సగానికి సగం తగ్గిపోయింది. పుష్కలంగా వర్షాలు కురిసి పంట బాగా ఉంటే దాదాపు 12 నుంచి 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి అయ్యేది. ఈ ఏడాది 6 నుంచి 7 క్వింటాళ్ల పత్తి దిగుబడి మాత్రమే కావడంతో రైతులకు పెట్టిన పెట్టుబడుల సైతం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు కూలీల కొరతతో దిగుబడి అయిన పత్తి సైతం ఏరలేక పొలాలలోనే వదిలేసి పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- క్వింటాలకు దాదాపు వెయ్యిరూపాయలు తగ్గింది..

ఈ ఏడాది సాగుచేసిన పత్తిపంట సగానికి సగం దిగుబడి తగ్గినప్పటికీ ధర మాత్రం పెరగకపోగా క్వింటాలు పత్తిపై దాదాపు రూ.1000 నుంచి రూ.1500లు తగ్గింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది నాణ్యమైన పత్తి క్వింటాలు రూ.7,500 పలికితే ఈ ఏడాది రూ.5500 నుంచి రూ.6 వేల వరకు ధర పలుకుతుంది. పత్తి పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- కల్వకుర్తి డివిజన్‌లో పత్తి పంట సాగు వివరాలు..

కల్వకుర్తి డివిజన్‌లో ఈ ఏడాది పత్తిపంట సాగు వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి డివిజన్ పరిధిలో మొత్తం నాలుగు మండలాల పరిధిలో పత్తి పంట సాగు వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి మండలంలో 14వేల 89 ఎకరాలలో పత్తి పంట సాగు చేయగా, వెల్దండ మండలంలో 12,278 ఎకరాలలో పత్తి పంట సాగు చేశారు.

ఊరుకొండ మండలంలో 5,362 ఎకరాలలో పత్తి పంట సాగు చేశారు. చారకొండ మండలంలో 14,981 ఎకరాలలో పత్తి పంట సాగు చేశారు. మొత్తం డివిజన్ పరిధిలో 46,712 ఎకరాలలో పత్తిపంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

నూతన విధి విధానంతోనే వరిధాన్యం సరఫరా

- అదనపు కలెక్టర్ కే.సీతారామారావు

నవతెలంగాణకందనూలు



ప్రభుత్వం విధించిన నూతన విధి విధానంతోనే మిల్లర్లకు వరిధాన్యం సరఫరా అవుతుందని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వరిధాన్యం కొనుగోలుపై నూతన విధివిధానాలపై అవగాహన సమావేశాన్ని మిల్లర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 27 ద్వారా తీసుకొచ్చిన నూతన విధివిధానాల ద్వారా వరిధాన్యం కొనుగోలు చేయాలంటే మిల్లర్లు కచ్చితంగా బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్లను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మిల్లర్లను నాలుగు రకాలుగా విభజించడం జరిగిందని, అందులో గతంలో ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లు 10శాతం, బ్యాంకు గ్యారంటీ లేదా 25శాతం సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. రెండవ రకం మిల్లర్లు గత బకాయిలతో పాటు పెనాల్టీ ఉన్నవారు 20శాతం, బ్యాంకు గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ అందించాలన్నారు. మూడవ రకం మిల్లర్లు 100శాతం బకాయిలు చెల్లించి 25శాతం, పెనాల్టీ పెండింగ్ ఉన్నవారు 25 శాతం పెనాల్టీ లేదా 25శాతం బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందజేసే ప్రక్రియను మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువు నేటితో ముగిసిం దని, అందుకు మిల్లర్లు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ ను వెంటనే అందజేయాలని సూచించారు. సమావే శంలో డీఎం సివిల్ సప్లై రాజేందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు ఉన్నారు.

కుల గణనపై సిబ్బందికి శిక్షణ



కందనూలు..



తెలకపల్లి..



ఊరుకొండ..

నవతెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సామాజిక విద్య, ఆర్థిక, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వేపై ఆర్డీవో సురేశ్ ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సర్వేకి సంబంధించిన అంశాలను ఎంపీడీవో కోటేశ్వర్, ఎమ్మార్వో సితారలు వివరించారు. డీఎల్పీఓ వరలక్ష్మి, ఎంపీఓ భరత్, ఎంఈవో భాస్కర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్స్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

తెలకపల్లి : మండల కేంద్రంలోని మండల సమావేశపు హాలులో ఎన్యూమరేటర్లకు, సూపర్వైజర్లకు సమావేశాన్ని నిర్వహించి సర్వే చేసే విధానంపై అంశాలవారీగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామ్‌లాల్, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసిల్దార్ జాకీర్ అలీ, ఎంపీఓ వెంకటయ్య, ఏవో నర్మద, ఏపీవో మల్లేష్, ఏపీఎం నిరంజన్, ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మ వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, సంబంధిత ఏన్యూమరేషన్ సిబ్బంది, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఊరుకొండ : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర ఇంటింటి సర్వే పై సంబంధిత అధికారులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీ వో కృష్ణయ్య, మండల నోడల్ అధికారి సంతోష్ రావు, తహసీల్దార్ రామ్ కోటి, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఎంఈఓ మురళి మోహన్, ఏపీఎం సహదేవ్, ఏపీవో నర్సిములు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఐకేపీ బుక్ కీపర్స్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు : మండల సమావేశం మందిరంలో ఎనిమినేటర్లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహసిల్దార్ కిరణ్మయి, ఎంపీఓ బ్రహ్మచారి, ఐసీడీఏ సూపర్వైజర్ వనజ, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజీపేట : మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని పలు సూచనలు సలహాలు చేశారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి గోవిందరాజులు, తహసిల్దార్ రామకృష్ణయ్య ఇన్చార్జి ఎంపీడీవో రాములనాయక్, మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ శెట్టి ఉన్నారు.

ఉప్పునుంతల : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆయా శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించి సర్వేపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీవో మాధవి, ఇంచార్జ్ తహసిల్దార్ కేశవ్, ఎంపీడీవో మోహన్ లాల్, ఎంపిఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాగేంద్రం అధ్యక్షతన సమగ్ర కుటుంబ సర్వే అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బాన్సి లాల్, సూపర్వైజర్ రాజేశ్వరి, ఏపీవో మంజుల, పలు గ్రామాల గ్రామపంచాతిలా కార్యదర్శులు, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.



తాడూరు..



తిమ్మాజిపేట..

నకిలీ విత్తనాలతో రైతుల ఆందోళన

నవతెలంగాణ-బిజినేపల్లి



మండలంలోని వెలుగొండ గ్రామానికి చెందిన దాదాపు 60 మంది రైతులు భాగ్యలక్ష్మి సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ షాప్‌లో తడాఖా అనే పత్తి విత్తనాలు ఈ వర్షాకాలం మొదటిలో కొనుగోలు చేయడం జరిగింది. కానీ పత్తి విత్తనాలు చెట్టు ఏపుగా పెరిగి చెట్టుకు గూడ కానీ, పూతగాని రాకపోవడంతో రైతులు ఆ సంబంధిత డీలర్‌కు సమాచారం ఇచ్చిన ఫలితం లేకపోయింది. ఎప్పుడు అడిగినా సదర్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడుతానని చెప్పుకుంటూ వస్తూనే ఉన్నాడు. చివరకు రైతులు అందరూ పోయి అడగగా కంపెనీ యాజమాన్యం గత నెల క్రితం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఇది తడాఖా సీడ్స్ కాదని ఒప్పుకోవడం జరిగింది. కంపెనీ నుంచి వచ్చిన వాళ్ళు కంపెనీ యజమానులతో మాట్లాడి చెబుతామని చెప్పి నేటి వరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. బుధవారం రైతులు అందరూ భాగ్యలక్ష్మి సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాప్ ముందు ఆందోళనకు దిగారు. దీనిపై డీలర్‌ను అడగగా నేను కంపెనీ యాజమాన్యంతో మాట్లాడాను. కానీ వాళ్ళు ఇంతవరకు స్పందించలేదని డీలర్ చెప్పడంతో రైతులు కొంత ఆందోళనకు గురై లక్షల పెట్టి పంట వేసుకొని నష్ట పోయాం. గత సంవత్సరంలో ఒక్క ఎకరాకు 20 క్వింటాల పత్తి తీసిన రైతు నేడు ఈ విత్తనాలతో కనీసం ఐదు క్వింటాలు గాని దిగుబడి రాకపోవడంతో రైతు తాను పెట్టిన పెట్టుబడి ఇలా కట్టాలని ఆందోళన చెందుతున్నారు. ఇదే గ్రామంలో దాదాపు గా 350 ఎకరాల తడాక విత్తనాలు వేసి మోసపోయామని రైతులు వాపోతున్నారు. ఈ సమాచారాన్ని స్థానిక అగ్రికల్చర్ ఆఫీసర్ నీతి రెడ్డికి తెలుపగా నేను పూర్తిస్థాయిలో పంటలు పరిశీలించి లాట్ వైస్‌గా విత్తనాలను పరిశీలించి ల్యాబ్‌కు పంపిస్తానని చెప్పారు. ఈ సమాచారం ఆధారంగా రైతులకు న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైతులు చందు, బాలనాగయ్య, జి.మల్లయ్య, సాకలి శీను, కే.బీరయ్య, గంగన మోని మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం పేరు మార్చడం తగదు

- టీడీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు చౌట గణేష్

నవతెలంగాణ-అచ్చంపేట



పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియాన్ని రాజీవ్ స్టేడియంగా మార్చుతామని స్థానిక ఎమ్మెల్యే వంశీ కృష్ణ చెప్పడం తగదని తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు చౌట గణేష్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులకు ప్రెస్ నోట్ విడుదల చేశారు. పటేల్ పట్వారి పాలనను రద్దు చేసి ప్రజల వద్దకే పాలన తెచ్చి రూపాయికి కిలో బియ్యంతో పేదల కడుపు నింపిన మహానీయుడు నందమూరి తారక రామారావు ఆలాంటి మహానీయుని పేరుతో 1996లో అప్పటి ఎమ్మెల్యే పోతుగంటి రాములు యువతను ఆటల్లో ప్రోత్సహించడం కోసం నందమూరి తారక రామారావు పేరుతో ఎన్టీఆర్ స్టేడియం అచ్చంపేటలో పెట్టారు. అంతటి ప్రాధాన్యత కలిగిన గతంలో ఏ ఎమ్మెల్యే ఆ పేరు మార్చలేదని, ఇప్పుడు మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. గతంలో ఆంధ్ర ప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మారుస్తే ఇప్పుడు అతనికి ఏ గతి పట్టిందో అందరికి తెలుసున్నారు. రానున్న రోజుల్లో మీకు కూడా అలాంటి గతి పడుతుందన్నారు. తెలం గాణలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం అచంపేట నుండి మొదలు అవుతుంది. ఎన్టీఆర్ పేరు మారిస్తే.. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఐక్యం చేసి నిరసన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వంశీకృష్ణ పేరుక మార్పు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు.

ఐకేపీ వివోఏలకు శ్రీనిధి ప్రోత్సహకాలు, పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సీఐటీయూ

నవతెలంగాణ-పెంట్లవెల్లి



ఐకేపీ వీవోఏలకు శ్రీనిధి ప్రోత్సాహకాలు, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూజిల్లా ఉపాధ్యక్షులు డి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఐకేపీ వీవోఏల మండల కమిటీ సమావేశం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య ఆఫీసులో ఆ సంఘం అధ్యక్షులు వెంకటస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివోఏలకు శ్రీనిధి ప్రోత్సకాలిచ్చి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్ల ను పరిష్కరించాలని నవంబర్ 4న మండల కేంద్రాల్లో 11, 12 తేదీల్లో కలెక్టరేట్ల ముందు 48గంటల ధర్నాలు చేయనున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వివోఏలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఏ పథకాన్ని ప్రవేశపెట్టిన కిందిస్థాయిలో ప్రజలకు చేరవేసే దాంట్లో కీలక పాత్ర వివోఏలు పోషిస్తున్నారన్నారు. అలాంటి వారికి కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి, రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించి, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించి, ఐడి కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలన్నారు. ఐకేపీ వివోఏల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేష్, ఐకేపీ వివోఏల మండల కార్యదర్శి వసంత, వివోఏలు మురళి, మధు, మురళి నాయక్, రాధా, నాగరాజు ఉన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరచిన కాంగ్రెస్

నవతెలంగాణ-తాడూర్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం కావస్తున్న మరిచిందని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిర్సవాడ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమున వారికి ఇస్తానన్న నెలకు 2500, ఇందిరమ్మ ఇండ్లు, 4000 పింఛను, రైతులకు మద్దతు ధర, ఉద్యోగాల కల్పన అన్నింటినీ గాలికి వదిలేసిందని ఆయన విమర్శించారు. గత 12 సంవత్సరాలుగా ఎస్సీలకు రుణాలు లేవన్నారు ఎస్సీ కార్పొరేషన్ రుణాలను అమలు పరచాలని లబ్ధిదారులకు ఇవ్వాలని తద్వారా ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పత్తికి గిట్టుబాటు ధర క్వింటాలుకు పదివేల రూపాయలు ఇవ్వాలని, అకాల వర్షాల వల్ల నష్టపోయిన పత్తి పంటలు ఇతర పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ మండల అధ్యక్షులు కొట్ర బాలు, ఉపాధ్యక్షులు భగవంతు, నాయకులు ఆంజనేయులు, వెంకటయ్య, హుస్సేన్, మసన్న తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం కమిటీల ఏకగ్రీవంగా ఎన్నిక

నవతెలంగాణ-కందనూలు

జిల్లాలో సగర సంఘం ఎన్నికలు అందరి ఆమోదయోగ్యంతో ఏకగ్రీవంగా సహృద్భావ వాతావరణంలో బుధవారం ఎన్నుకుంటున్నట్లు జిల్లా సగర సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు సాగర్ తెలిపారు. నియోజకవర్గంలోని తాడూరు మండలంలోని వెన్నచర్ల, తిరుమలపూర్, తిమ్మాజీపేట మండలంలోని బావాజీపల్లి, గోరిట, తిమ్మాజీపేట, నాగర్‌కర్నూల్ మండలంలోని నల్లవెల్లి, శ్రీపురం, తాడూరు గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నరన్నారు. అధ్యక్షుడిగా సంగిశెట్టి చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా సంగిశెట్టి నరేష్, కోశాధికారిగా ఆంజనేయులు తదితరులను ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమాలలో సంఘం నాయకులు చిలుక పార్వతయ్య, అతి నారపు వెంకటేష్, కొమ్ముల వెంకటయ్య, అతినారపు బంగారయ్య, గుంటి తిరుపతయ్య, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

నల్లమల్ల అడవుల్లో చెంచు యువకుడు అదృశ్యం..!


నవతెలంగాణ-అచ్చంపేట



అటవీ ప్రాంతంలోని మల్లాపూర్ చెంచుపెంటకు చెందిన చిగురుల గురవయ్య అర్ధరాత్రి అదృశ్యమైనట్లు స్థానికులు తెలిపారు. చెంచులు స్థానిక అడవిలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో చెంచు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. 20 రోజుల క్రితం లింగాల మండలంలో ఎర్రపెంటకు చెందిన శంకర్ అనే యువకుడు అడవిలో అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లి అదృశమయ్యాడు. అటవీ శాఖ, పోలీస్ శాఖ 20 రోజులుగా వెతుకుతున్న నేటికి ఆచూకీ లభించలేదు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-తెలకపల్లి



మండల కేంద్రానికి చెందిన సెర్ప్ ఉద్యోగి సీసీ నిర్మల ఇటీవల గుండెపోటు తో మృతి చెందడంతో బుధవారం బాధిత కుటుంబాన్ని సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.75వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.నిరంజన్, తెలకపల్లి ఏపీఎంలు నిరంజన్, చంద్రయ్య వంగూరు, శ్రీనివాసులు, ఈశ్వర్, సీసీలు ప్రభాకర్, రామస్వామి, శంకర్, నిరంజన్, సునీల్ రెడ్డి, ఎమ్మెస్సీసీ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు

నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని సాతాపూర్ గ్రామానికి చెందిన తిరుపతయ్య అనే వ్యక్తి తన పొలంలోని విద్యుత్ తీగలను పరిశీలిస్తున్నగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలు అయ్యాయని గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతయ్య అనే వ్యక్తి కరెంట్ రిపేర్ చేస్తుండగా తీవ్ర గాయాలకు గురి అయ్యాడని చుట్టుపక్కల ఉన్న పొలాల వారు చూసి కుటుంబ సభ్యులు తెలుసుకొని హైదరాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి సైకిల్ పోటీకి భారతి ఎంపిక



నవతెలంగాణ-మాగనూరు

తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పి. మల్లారెడ్డి, బి.విజయకాంతరావు ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్రాంత పీఈటి బి.గోపాలం ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాస్థాయి సైకిలింగ్ పోటీలు ఈనెల 20న కొత్త గార్లపల్లి రోడ్డులో నిర్వహించిన పది కిలో మీటర్ల రోడ్డు స్పీడ్ సైకిలింగ్ పోటీలలో మాగనూరు మండలం ఉజ్జల్లి గ్రామానికి చెందిన అతి పేద కుటుంబమైన బి.నర్సింలు, వెన్నెల ప్రథమ కూతురు బి.భారతి మక్తల్‌లో జరిగిన రోడ్డు స్పీడ్ పది కిలోమీటర్ల సైకిల్ పోటీలలో పాల్గొని, 14 సంవత్సరాల లోపు బాలికల విభాగంలో తృతీయ స్థానం పొంది రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలకు ఎంపికైనట్లు తండ్రి బి.నర్సింలు విలేకరుల సమావేశంలో తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడా ఆణిముత్యాలు చాలామంది ఉంటారని మంచి స్టామినా కలిగిన క్రీడాకారులు లభిస్తారని వారిని వెలికితీయుటకు ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి సైకిల్ ఇన్ క్రీడలకు ఎంపికైన భారతి నవంబర్ 4 నుండి 6 వరకు జనగామ జిల్లా కేంద్రంలో జరుగు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటుందని తెలిపారు. నరసింహులు మాట్లాడుతూ మా పేద కుటుంబంలోని మా కూతురు బి.భారతి చిన్న వయసులో రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటున్నందుకు చాలా ఆనందంగా ఉందని తెలుపుతూ, మా కూతురును క్రీడల వైపు మళ్లించుటకు నా శాశక్తుల కృషి చేస్తానని తెలిపారు. బి.భారతి ప్రస్తుతం కృష్ణ మండల కేంద్రంలో గల కస్తూరిబా పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నది. రాష్ట్రస్థాయి సైకిల్ క్రీడలకు ఎంపికైన భారతిని జిల్లా సైకిల్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం, కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉజ్జల్లి గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు అభినందించారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ - నారాయణపేట

నారాయణపేట మండల పరిధిలోని లింగంపల్లి గ్రామం దగ్గర భాగ్యలక్ష్మి మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోనంగేరి హనుమంతు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు నూతన పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డికి, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మార్కెట్ యార్డు సెక్రటరీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

- మండల తహసిల్దార్ దయాకర్ రెడ్డి



నవతెలంగాణ - క్రిష్ణా

పౌర హక్కుల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని మండల తహశీల్దార్ దయాకర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గురజాల గ్రామంలో బుధవారం నిర్వహించిన పౌర హక్కుల అవగాహన కార్యక్రమంలో గ్రామంలో హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందన్నారు. ఒకరు ఇంకొకరిపై వివక్ష చూపితే చట్టారీత్యా నేరం అవుతుందన్నారు. గ్రామంలో అంటరానితనం వంటి అమానుషమైన చర్యలకు పాల్పడితే వ్యక్తులపై చర్యలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చదువుకోవడం వల్లనే సమాజంలో గౌరవ మర్యాదలు దొరుకుతున్నాయన్నారు. చదువు లేకుంటే మన హక్కుల గురించి మనం కూడా తెలియదని గ్రామంలోని ప్రజలు అందరూ వారి పిల్లలకు సరైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేంద్రప్ప, ఏఎస్ఐ కథలప్ప, సురేంద్రబాబు, ఆర్ఐ అమర్నాథ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది రామకృష్ణ, హనుమంతు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వ ధర్మ సమ్మేళన గోడ పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ - నారాయణపేట

నవంబర్ 7వ తేదీన నారాయణపేట మండల పరిధిలోని కొల్లంపల్లిలో జరిగే సర్వ ధర్మ సమ్మేళనంను విజయవంతం చేయాలని దర్గా పీఠాధిపతి సయ్యద్ షా జలాల్ హుస్సేని అష్రఫీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 550వ ఉర్సు సందర్భంగా కొల్లంపల్లిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సజ్జదా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా జాలాల్ హుస్సేని ఆధ్వర్యంలో నిర్వహించే 24వ సర్వ ధర్మ సమ్మేళనంలో జిల్లా ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అశ్రఫీయా ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మహమ్మద్ షఫీ, న్యాయవాది సలీమ్ కోరారు. ఈ సందర్భంగా ఖాన్ ఖాహే ఖాతలియాలో సర్వ ధర్మ సమ్మేళనంనకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడేప్ప, అబ్దుల్ ఖరీం వెంకటయ్య సుదర్శన్ పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాయి స్కూల్‌లో దీపావళి సంబరాలు

నవ తెలంగాణ - నారాయణపేట

జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్‌లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు, టీచర్లు దీపావళి సందర్భంగా లక్ష్మీదేవి చిత్రపటానికి పూజలు చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీచర్లు విద్యార్థులకు బాణాల పేర్లను తెలుపుటకు నమూనాలు తయారు చేసి చూపించారు. టపాసులు కాల్చి ముందస్తు దీపావళి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సాయిలీల, ప్రిన్సిపాల్ బాలప్ప, టీచర్లు అమీనా, హెచ్.నర్సింహా, సుమ, ఉమ, శ్రావణి, మాధవి, అనసూయ, లక్ష్మిప్రియ పాల్గొన్నారు.



సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



నవ తెలంగాణ - క్రిష్ణా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ. కుల సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను మండలంలో విజయవంతంగా పూర్తి చేయాలని మండల తహసిల్దార్ దయాకర్ రెడ్డి ఎంపీడీవో జానయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కుటుంబ సర్వేలో పాల్గొని అధికారులకు దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 6 నుంచి 18 వరకు నిర్వహించే సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను చేసేందుకు ఆయా గ్రామాలకు కేటాయించిన సిబ్బందిలకు మండల అధికారులు తగు సూచనలను చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణ్, ఎమ్మార్ అజయ్ ఆయా సిబ్బందిలకు సమగ్ర కుటుంబ సర్వేలో అనుసరించవలసిన పద్ధతులను వివరించారు. ఒక కుటుంబానికి సంబంధించి అన్ని రకాల వివరాలు ఎలా నమోదు చేయాలో కుటుంబ యజమానితో ఏ విధంగా విషయాలను అడిగి నమోదు చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీఓ విజయలక్ష్మి, పంచాయత్ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, తదితరఅధికారులు ఉన్నారు.

కుల గణన సర్వే నుంచి ..

అంగన్వాడీలను మినహాయించాలి : సీఐటీయూ



నవతెలంగాణ - నారాయణపేట

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సర్వేలో అంగన్వాడీలను మినయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్, సీడీపీఓ నారాయణపేట ప్రాజెక్ట్ కార్యాలయాల్లో వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బాల్‌రామ్ మాట్లాడుతూ అంగన్వాడీలకు ఐసీడీఎస్ సంబంధం లేని పనులు అప్పజె ప్పడం కారణంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఆటంకం అవుతుందని, పిల్లలకు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలు అందించడంలో అంతరాయం కలుగుతుందన్నారు.

బీఎల్వో విధులు, ఎన్నికల విధులు, ప్రజా పాలన సర్వే పనులు తదితర అనేక పనులతో అంగన్వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో టీచర్లు పని చేయకపోవడం వలన కింది స్థాయిలో లబ్ధిదారుల చేత విమర్శలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణల శ్రేయస్సు దృష్ట్యాకుల గణన సర్వే నుంచి అంగన్వాడీలను మినయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రహార్ పేట, బాహార్ పేట సెక్టార్‌లకు చెందిన అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మక్తల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సర్వేలో అంగన్వాడీలను మినయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మక్తల్ పట్టణ కేంద్రంలో ఐసీడీఎస్, సీడీపీఓ మక్తల్ ప్రాజెక్టు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు ఐసీడీఎస్ సంబంధం లేని పనులు అప్పజెప్పడం కారణంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఆటంకం అవుతుందని పిల్లలకు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలు అందించడంలో అంతరాయం కలుగుతుందన్నారు. బీఎల్వో విధులు, ఎన్నికల విధులు, ప్రజా పాలన సర్వే పనులు తదితర అనేక పనులతో అంగన్వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో టీచర్లు పనిచేయకపోవడ వలన కింది స్థాయిలో లబ్ధిదారుల చేత విమర్శలకు ఎదుర్కొంటు న్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణల శ్రేయస్సు దృష్ట్యాకుల గణన సర్వే నుంచి అంగన్వాడీలను మినయించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మండలంలోని అంగన్వాడీ సెక్టార్‌లకు చెందిన అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదు : అదనపు ఎస్పీ



నవతెలంగాణ - నారాయణపేట

జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు విభాగంలలో విధులు నిర్వహిస్తున్న బి.నిరంజన్ బుధవారం పదవి విరమణ పొందిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ ఎండి.రియాజ్ ఏఆర్‌హెచ్‌సీ బి.నిరంజన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. పోలీస్ శాఖలో 40 సంవత్సరాల పాటు సేవలందిస్తూ పదవి విరమణ పొందడం అభినందనీయమన్నారు. మీ యొక్క సేవలు అనుభవాలు పోలీస్ శాఖకు ఎంతో అవసరం ఉంటాయన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజం అని పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని కోరారు. విధి నిర్వహణలో పదవీ విరమణ పొందిన కూడా ఎప్పుడైనా పోలీస్ శాఖ మీకు అండగా ఉంటుందని తెలిపారు. రిటైర్మెంట్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ త్వరగా అందేలా చేయాలని డీపీఓ స్టాఫ్‌కు సూచించారు. మీకు ఎలాంటి సమస్య వచ్చిన నేరుగా మమ్మల్ని సంప్రదించాలని నిరంజన్‌కు, వారి కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్ఐ శివ శంకర్, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్స్‌కు సర్వే పై శిక్షణ



నవతెలంగాణ - ఊట్కూర్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రమైన ఊట్కూర్ లోని ఐకేపీ కార్యాలయంలో సోషియో ఎకనామిక్ సర్వేపై టీఓటీలు శిక్షణ ప్రోగ్రామ్ సూపర్వైజర్ ఎన్యూమరేటర్స్‌కు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ప్రోగ్రాంలో మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవో ధనంజయ గౌడ్, తహసిల్దార్ చింత రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం నిర్మల, అంగన్వాడీ సూపర్వైజర్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, వివోఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత



నవతెలంగాణ - నారాయణపేట

జిల్లా కేంద్రంలోని బాపునగర్ కాలనిలో శ్రీనివాస్ చెందిన కిరాణా షాప్‌లో ప్రభుత్వ నిషేధిత అంబర్, జర్ధ, గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉంచి ప్రజలకు అమ్ముతుండగా పక్క సమాచారంతో టాస్క్‌ఫోర్స్, నారాయణపేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి రూ.6,120 విలువగల గుట్కా ప్యాకెట్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి శ్రీనివాసుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను నిల్వ ఉంచిన, అమ్మిన, రవాణా చేసిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రజలపై భారం మోపితే సహించం

- మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్



నవతెలంగాణ - మక్తల్

రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై ఎలాంటి భారం మోపిన సహించమని ప్రజల తరఫున పోరాటం చేస్తామని మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాజుల వాసిరెడ్డి. పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతులు స్పష్టం చేశారు. బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణసంచా మిఠాయి పంపిణీ సంబరాల అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 18,500 కోట్ల కరెంటు చార్జీలను ప్రజలపై భారం మోపాలని ప్రయత్నాన్ని బీఆర్ఎస్ పార్టీ అడ్డుకుందని తెలిపారు తమ పార్టీ అడ్డుకోకపోతే సీఎం రేవంత్ రెడ్డి విద్యుత్ ఛార్జీలు మోత మోగించేవారని అన్నారు ప్రజాస్వామ్యంలో తన ఇష్టంగా వ్యవహరిస్తే ప్రజలు తిరుగబడతారని విషయం ఈ ప్రభుత్వం గుర్తించుకోవాలని తెలిపారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను తీసుకువచ్చిన వాటిని అడ్డుకునే శక్తి తమ పార్టీకి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు మొగిలప్ప, జగ్గలి రాములు, బీఆర్ఎస్ మాగనూరు మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మక్తల్ బీఆర్ఎస్ నాయకులు మారుతి గౌడు, కర్ని సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జుట్ల శంకర్, చందపురం అశోక్‌కుమార్‌గౌడ్, పూజారి కురుమయ్య, రుద్ర సముద్రం మహమూద్ భాష, భూత్పూర్ కురువ నర్సింలు, శివారెడ్డి, మిల్లర్ సురేష్, ఈశ్వరి యాదవ్, జుట్ల సాగర్, ఎల్లిగండ్ల బాలప్ప, బండారు రవి, బండారు బాలు, నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు

అన్ని కులాల రాజకీయపరమైన చర్చ



నవతెలంగాణ - నారాయణపేట

బీ.సి కమీషన్ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్ అధ్యక్షతన బుధవారం అన్ని కులాల సామజిక వర్గాలకు సంబందించిన ఆర్థిక పరమైన, సామజిక పరమైన, రాజకీయ పరమైన సమస్యల గురించి చర్చించారు. ఇందులో భాగంగా అన్ని కులాల వారి సూచనలను, ఆదేశాలను, వారి సమస్యలను సేకరించారు. ఈ సమావేశంలో కె.ఉమాపతి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఈదప్ప (దామరగిద్ద మాజీ సర్పంచి) రాజన్న దారి వి.శరణప్ప, మానేశ్వర్ చారి, విశ్వకర్మ సంఘం కృష్ణ, రాజు రజక సంఘం, బోయ లక్ష్మణ్, వెంకట్రాములు వాల్మీకి సంఘం, నాయి బ్రాహ్మణ సంగం నుండి రవి, సిద్ధు సంఘ నాయకులు, ట్రాన్స్ జెండర్స్ తాంన్సిక, కరిష్మా, తదితరులు పాల్గొన్నారు. మిగతా కులాల వారు వారి సమస్యలను లేఖ రూపంలో రాసి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో మహబూబ్‌నగర్‌లో నవంబర్ 8న సాయంత్రం 5గంటల లోపు విజ్ఞప్తి పత్రాలను బీ.సి కమీషన్‌కు సమర్పించాలని తెలిపారు.

చెస్ టోర్నమెంట్‌కు ఎంపిక

నవతెలంగాణ - నారాయణపేట

అఖిలభారత చెస్ టోర్నమెంట్‌కు పేట విద్యార్థి ఎంపికైనట్లు చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెర్సి వసంత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి ఆకుల బాలకృష్ణ తండ్రి ఆకుల బాలప్ప పీపీ తమిళనాడులోని వెల్ యూనివర్సిటీలో నవంబర్‌లో నిర్వహించే టోర్నమెంట్‌కు ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

పెరటి కోళ్ల పంపిణీ



నవ తెలంగాణ - క్రిష్ణా

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు బుధవారం 1000 పేరటి కోళ్ల పంపిణీ చేసినట్లు ఏటీఎం బసవరాజ్ తెలిపారు. అనంతరం మండల తహసిల్దార్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 50మంది మహిళల ఆర్థిక స్వావలంబనలో భాగంగా వారు పెంచుకునే స్థలాన్ని పరిగణనలోకి తీసుకుని ఒక్కొకరికి 35 నుంచి 50 కోళ్ల పంపిణీ చేశామన్నారు. పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, కోళ్లను జాగ్రత్తగా పెంచి ఆర్థికంగా వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జానయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మారెమ్మ, మండల సమైఖ్య అకౌంటెంట్ అశ్విని, ఆపరేటర్ మహేందర్, వివోఏలు లక్ష్మి, కృష్ణ, లింగప్ప , శంకరమ్మ పాల్గొన్నారు.

రైతులు పండించిన పంటలన్నిటిని కనీస మద్దతు ధర ఇవ్వాలి



- అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకుల డిమాండ్

నవతెలంగాణ - ఊట్కూర్

రైతు పండించిన పంటలన్నింటికీ న్యాయమైన కనీస మద్దతు ధరలు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. పత్తి క్వింటాలుకు రూ.18,500, వరి క్వింటాలకు రూ.5వేలు కనీస మద్దతు ధర ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అంజప్ప, బాబు, లొట్టి గోవిందు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఊట్కూర్ మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ప్రగతి శీల రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు వివిధ గ్రామాల రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పత్తి, వరి ఇతర పంటలు చేతికి వస్తున్న తరుణంలో అమ్ముకోవడానికి మార్కెట్‌కి వెళితే గిట్టుబాటు ధరరాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సీసీఐ రూ.7,320 కొనవలసి ఉన్నదని విజయ్ కాటన్ మిల్‌లో రైతులు అమ్ముకోవడానికి పత్తి తీసుకువెళ్లిన క్వింటాలుకు రూ.4వేల నుండి 6వేల వరకు అతి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. అధిక వర్షాల వల్ల పత్తి పంట 20శాతం కూడా చేతికి రాలేదన్నారు. ఉత్పత్తి ఖర్చులు కూడా చేతికిరాక తీవ్రంగా నష్టపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధర కల్పించడంలో విఫలమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి 63.53 లక్షల ఎకరాలు సాగైతుందని, వరి 60.39లక్షలు ఎకరాల్లో పంట సాగవుతుందన్నారు. దీనివల్ల 146.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ రైతు అకాల వర్షాల వల్ల పంట నష్టం జరిగి తీవ్రంగా నష్టాలపాల అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. ఎంఎస్‌పీ కనీస మద్దతు ధర పత్తికి క్వింటాలుకు రూ.18,500, వరికి రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫారసుల కనులంగా ధరలు నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కారం కావడం లేదని, బోనస్ రూ.500 కొనుగోలు కేంద్రాలు, పంట నష్టపరి హారం 2 లక్షల రుణమాఫీ రైతు భరోసా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. భూ సమస్యలు ధరణిలో ఆ పరిష్కృతంగా ఉన్నాయి తక్షణమే రైతాంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి దక్షణం ఎకరాకు రూ.25వేల చొప్పున అందించాలన్నారు. వ్యవసాయ కార్మికులకు నెలకు పదివేల రూపాయల పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు రైతు బీమా పంటల భీమకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి భరోసా కల్పించాలన్నారు తక్షణమే రైతాంగ సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాను సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ డివిజన్ కార్యదర్శి సలీమ్ మద్దతు తెలిపి మాట్లాడుతూ పెండింగ్‌లో పెట్టిన రెండు లక్షల రుణ మాఫీని తక్షణమే విడుదల చేయాలన్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలన్నారు. అంతకుముందు తహసిల్దార్ చింత రవికి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పొర్ల నరసింహులు, చిన్న బాలు, పగిడి మారి రాము, ఆంజనేయులు రాజు రైతులు పాల్గొన్నారు.

నారాయణపేట : ఖరీఫ్‌లో రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం గిట్టుబాటు ధరలు నిర్ణయించాలని మద్దతు ధరలతో పాటు ప్రభుత్వం బోనస్ ఇచ్చి కొనుగోలు చేయా లని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీ కేఎస్) ఆధ్వర్యంలో నారాయణపేట తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా మండల అధ్యక్షుడు బి.నారాయణ అధ్యక్షతన ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసిల్దార్ రామకృష్ణకు డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ పంటలన్నిటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సమగ్ర ఖర్చుల ప్రతిపాదికన కనీసం మద్దతు ధరలు నిర్ణయించి ప్రభుత్వమే విస్తృతంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వేగవంతంగా కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం వరి సన్నారకంకు మాత్రమే బోనస్ ప్రకటించి మిగతా పంటలు పండించిన రైతులను విస్మరించడం సరికాదన్నారు. ప్రభుత్వ ప్రకటించిన అన్ని రకాల వరి, పత్తి, కంది, వేరుశనగ, మినుము, మొక్క జొన్న,చెరుకు, పసుపు, పంటలన్నిటికీ బోనస్ ఇవ్వాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇవ్వవలసిన రైతు భరోసాను ప్రభుత్వం ఎగ్గొట్టకుండా ఖరీఫ్, రబీ 2 పంటలు కలిపి 15 వేల రూ. రైతు ఖాతాలలో జమ చేయాలన్నారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ జిల్లాలో మొత్తం రైతులు 99 వేల 837 మంది రైతులకు గాను 59, 839 మంది రైతులకు మాత్రమే మాఫీ చేశారన్నారు. మిగతా దాదాపు 40 వేలమంది రైతులకు రుణమాఫీ చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా వారిని వంచించడం, మోసగించ డం సరికాదన్నారు. ఈ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాడి మన సమస్యలు మనం పరిష్కరించుకొనుటకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం మండల కార్యదర్శి బాలకృష్ణ, ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్య క్షులు హాజీ మలన్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నారాయణ పేట్ పట్టణ కార్యదర్శి కెంచే నారాయణ, టియుసిఐ జిల్లా నాయకుడు భీమేష్, సుభాష్, కృష్ణ, ఎం.హనుమంతు, సాయిలు, నర్సింలు, సలీం పాల్గొన్నారు.



నజీర్ మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

కార్మికుల హక్కుల కోసం పోరాడిన నజీర్ మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటస్వామి అన్నారు. బుధవారం మానవపాడు మండల కేంద్రంలో నజీర్ అంత్యక్రియలో పాల్గొని ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవపాడు మండలకేంద్రంలోని సివిల్ సప్లై గోదాం హమాలీ కార్మికునిగా పని చేస్తూ సీఐటీయూ సంఘంలో చేరి కార్మికుల హక్కుల కోసం వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాలలో నజీర్ చురుకుగా పాల్గొనే వాడని, అలాంటి చురుకైన కార్యకర్తను కోల్పోవడం కార్మిక వర్గానికి తీరని లోటన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యం బారిన పడిన నజీర్ దురదృష్టవశాత్తు మంగళవారం చనిపోవడం బాధాకరమన్నారు. క్రమశిక్షణ అంకిత భావంతో సీఐటీయూ సంఘ పిలుపులను అమలు పరుస్తూ కార్మిక వర్గ ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడే వారన్నారు. కార్మికుడిగా తన బాధ్యతలు నెరవేరుస్తూనే సాటి కార్మికుల కోసం సమాజం కోసం తన సమయాన్ని వెచ్చించే వారని, నజీర్‌ను ఆదర్శంగా తీసుకొని యువకులు కార్మిక వర్గ ప్రయోజనాల కోసం బలమైన కార్మిక వర్గ పోరాటాలు ఉద్యమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీయస్ జిల్లా కార్యదర్శి జీ. రాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ, ఉండవెల్లి సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, మానపాడు కేవీపీఎస్ మండల అధ్యక్షుడు జే.రాజు, హమాలీలు రఫీ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికి ఘన సన్మానం



నవతెలంగాణ - ధరూర్

మండలంలోని అల్లపాడు గ్రామంలో మంగళవారం రామయ్య డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అల్లపాడు గ్రామానికి చెందిన శ్రీహరికి శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా శ్రీహరి మాట్లాడుతూ చిన్న వయసులోనే జాతీయస్థాయిలో ఉన్నతమైన ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివానని అన్నారు. ఇందుకు కారణం రామయ్య డిఫెన్స్ అకాడమీ వారు ప్రత్యేకంగా ప్రోత్సహించి విద్యా, ఉద్యోగ పరంగా అన్ని విధాలుగా సహ కారం అందిం చారని అన్నారు. అందుకు రామ య్య డిఫెన్స్ అకాడమీ కి ప్రత్యేక ంగా కృత జ్ఞతలు తెలిపారు. ఈ సంద ర్భంలో గ్రామ మాజీ సర్పంచ్ ఈరన్నగౌడ్ మాట్లా డుతూ వెనుకబడ్డ అల్లపాడు గ్రామం నుంచి జాతీయస్థాయిలో నావికదళంలో ఉన్నతమైన ఉద్యోగం సాధించిన శ్రీహరికి ప్రత్యేకంగా గ్రామ స్తులు శుభాకాంక్షలు తెలిపారు.ఇలాంటివారిని గ్రామ నిరుద్యోగులు ఆదర్శంగా తీసుకొని అల్లపాడు గ్రామానికి పేరు తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక మంలో రామయ్య డిఫెన్స్ అకాడమీ, గ్రామస్తులు, మాజీ సర్పంచ్ ఈరన్న గౌడ్, ప్రతాప్ గౌడ్, ఫిల్డ్ అసిస్టెంట్, శ్రీధర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఇండ్లకు .. నష్టపరిహారం చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీ.వీ నరసింహ



నవతెలంగాణ - గట్టు

అక్రమ బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఇండ్లకు నష్టపరిహారం చెల్లించాలని, అక్రమ క్వారీ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీ.వీ నరసింహ డిమాండ్ చేశారు. భారత్ మాల ఆరు రహదారుల రోడ్డు నిర్మాణంలో భాగంగా గట్టు మండలంలోని సల్కాపురం, జోకాన్ గట్టు,తారపురం గ్రామాల మధ్యలో రాయపురం గ్రామ శివారులో సర్వే నంబర్ 199 లోగల గుట్ట నందు మెగా కంపెనీ సబ్ కాంటాక్ట్ లో భాగంగా ఏవీపీ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టెండర్ దక్కించుకున్నారు. గతంలో ఈ మైనింగ్ కు అనుమతి లేదని చాలా సందర్భాల్లో ప్రమాదాలు జరిగి ఒక కార్మికుడు మరణించారని, ఆ సందర్భంగా క్వారీని రద్దు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అక్రమంగా బ్లాస్టింగ్ చేయడం వల్ల జోకాను ,గట్టు , సల్కాపురం గ్రామాలకు సంబంధించిన ఇండ్ల గోడలు నెర్రలు బారుతు న్నాయని, ఆ రెండు గ్రామాల ప్రజలు భయాందోళనలో ఉన్నారని ఆవే దన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారులు స్పందించి తక్షణమే క్వారీని రద్దుచేసి బాధ్యులకు న్యాయం చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయ కులు స్వామి, శాంతన్న, రెడ్డప్ప , వీరేశ , నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ - మల్దకల్

మండలంలోని అడవిరావులచెర్వు, విట్టాలపురం గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 334 తెల్ల పశువులు, 69 గేదెలకు గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యధికారులు వినయ్ కుమార్, ఉషాలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రాజేంద్ర వీఏ, ప్రగతి వీఏ, అర్జున్ సింగ్‌వీఏ, రామాం జనే యులు ఓఎస్, రాము ఓఎస్, రమేశ్వరయ్య ఓఎస్ , మధు ఓఎస్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



నవతెలంగాణ - మల్దకల్

మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్‌లో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనపై అవగా మన కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులను హాజరు పరిచి మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారినపడి తమ భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోకూడదని తెలిపారు. ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణకు శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా విద్యార్థులను కాపాడేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖను ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అన్ని ప్రభుత్వ ప్రయివేటు ఉన్నత పాఠశాలల్లో మాదకద్రవ్యాల వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టి, విద్యార్థులను వాటికి దూరం చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఇందుకు 'ప్రహరీ క్లబ్'లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో తరగతికి ఇద్దరు చొప్పున చురుకైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఘం నుంచి ఒకరు, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఒకరిని ఎన్నుకున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ.సురేష్, ఎంపీడీవో ఆంజనేయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుజాతమ్మ గారు,కానిస్టేబుల్ గోపాల్ నాయక్, సూర్య ప్రకాశ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, నాగేశ్వరరావు, గీత, భాస్కర్ పాల్గొన్నారు.

సర్వేపై ఎన్యూమరేటర్లకు అవగాహన

నవతెలంగాణ - మల్దకల్

మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర కుటుంబ సర్వేస్పెషల్ ఆఫీసర్ కాంతమ్మ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఎన్యూమరేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీలు, టీఎల్వోలు, టీఏ లు , ఎస్ ఆర్ ఎస్ జీ ఎస్ బి ఓ ఏ లు సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు . నరహరి ఏపీఎం సుజాత ఏపీవో రఘు టీచర్ ఈ ట్రైనింగ్ కు మండల స్పెషల్ ఆఫీసర్ సీఈవో ఎంపీడీవో ల పర్యవేక్షణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి ట్రైనర్ రఘు, టీచర్ ఏపీవో సుజాత , ఎంఈఓ సురేష్ , ఏవో రాజశేఖర్, సూపరింటెండెంట్ పెద్ద నరసన్న , ఆర్ఐ నాగిరెడ్డి పాల్గొన్నారు.



జోరుగా ఇసుక రవాణా..

- చోద్యం చూస్తున్న అధికారులు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

గట్టు మండలంలో జోరుగా ఫిల్టర్ ఇసుక దందా కొనసాగుతుంది. ఇసుక దందా చేస్తూ పోలీసు, రెవెన్యూ అధికారులకు ఇసుకాసురులు సవాల్ విసురుతున్నారు. గొర్లకాన్‌దొడ్డి , పెంచిక లపాడు, బల్గెర గ్రామాలలో ఇసుక దందా కొనసా గిస్తూ పట్టపగలే రవాణా చేస్తున్నారు. గట్టు మండలంలోని గొర్లకాన్‌దొడ్డి , పెంచికలపాడు, బల్గెర గ్రామాలలో గల వాగులు, వంకలు, ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. వాగుల్లో వంకలలో భూములను తవ్వుతూ మట్టిని ట్రాక్టర్‌లలో నింపి తీసుకుపోయి దానిని నీటితో ఫిల్టర్ చేసి మండలకేంద్రంతో పాటు చుట్టూపక్కల గ్రామాలకు తరలించి అమాయక ప్రజలకు విక్రయిస్తూ నట్టేట ముంచుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

నిబంధనల ప్రకారం..
మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలి

- కలెక్టర్ బీ. ఎం సంతోష్



నవ తెలంగాణ - జోగులంబ గద్వాల

రైస్ మిల్లర్లు ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు చేయాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ ను పౌరసరఫరాల కార్పొరేషన్‌కు సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ బీ.ఎం. సంతోష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వరిధాన్యం కొనుగోలు పై మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు చేయాలంటే మిల్లర్లు ఖచ్చితంగా బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్లను సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మిల్లర్లను నాలుగు రకాలుగా విభజించడం జరిగిందని , అందులో గతంలో ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లు 10 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. రెండవ రకం మిల్లర్లు గత బకాయిలతో పాటు పెనాల్టీ ఉన్నవారు 20 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ అందించాలన్నారు. మూడవ రకం మిల్లర్లు 100 శాతం బకాయిలు చెల్లించి 25 శాతం పెనాల్టీ పెండింగ్ ఉన్నవారు 25 శాతం పెనాల్టీ లేదా 25 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే నాలుగో రకం మిల్లర్లు డిఫాల్టర్లు గా ఉన్నవారికి ధాన్యం కేటాయించబడదని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ అభ్యర్థన మేరకు.. మిల్లర్లకు అదనపు మిల్లింగ్ చార్జీలు అందజేయడం జరుగుతుందని అన్నారు. దొడ్డు రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.30/- అలాగే సన్న రకానికి రూ. 40/- చెప్పన అదనపు మిల్లింగ్ చార్జీలుఅందించడం జరుగుతుందని, మిల్లర్లకు కేటాయించగా మిగిలిన ధాన్యాన్ని ఇంటర్మీడియట్ గోదాంలలో భద్రపరచడం జరుగుతుందన్నారు. మిల్లర్లు వరి ధాన్యం కొనుగోలుకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలన్నారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీనారాయణ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ విమల, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, రైస్‌మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవ తెలంగాణ - జోగులంబ గద్వాల

గట్టు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. గట్టు మండలంలోని వివిధ గ్రామాల చెందిన 340మంది ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి / షాదీముబారక్ రూ.3,40, 05, 440 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికలలో ఆశీర్వ దించి మరొక్కసారిగా ఎమ్మెల్యే గెలుపొందడానికి అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నేను ఎమ్మెల్యేగా అయిన తర్వాతనే గట్టు మండలంలోని అభివృద్ధి సంక్షేమం చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు , డ్రైనేజీల నిర్మాణం, కమ్యూ నిటీ హాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం గట్టు మండలంలో అక్షరాస్యత శాతం పెరగడంతో గట్టు మండలంలోని విద్యార్థులు వివిధ రంగాలలోని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారన్నారు.ఇటీవలే 6 మంది గట్టు మండల విద్యార్థులు ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గట్టు మండలం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నారు. త్వరలో గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు కూడా నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి గట్టు మండలాన్ని సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కులను అందిస్తామన్నారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధికి అధికార పార్టీలోని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో . భవిష్యత్‌లో సీఎం సహకారంతో గతంలో గద్వాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకున్నామో భవిష్యత్తులో కూడా అదేవిధంగా మరింత అభివృద్ధి చేసుకునే విధంగా తనవంతు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళలు కళ్యాణలక్ష్మి, డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు , జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, రామకృష్ణారెడ్డి , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ ఎంపీపీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా ధర్మకారి గోపాల్‌జీ



నవతెలంగాణ - ధరూర్

ధరూర్ మండలం నెట్టెంపాడు గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసా గుతున్న ధర్మకారి గోపాల్‌జీకి తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర కార్యని ర్వాహణ కార్యదర్శిగా ఆ కమిటీలో చోటు లభించింది. తెలంగాణ బీసీ మహా సభ రాష్ట్ర అధ్యక్షులు మెట్టుకాడి శ్రీని వాసులు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లోని ఓ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ధర్మకారి గోపాల్‌జీ మాట్లాడుతూ తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాసులకు , కమిటీ సంఘానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ బీసీ మహాసభ ఆశయాలకు అనుగుణంగా, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

భారతదేశంలోని రాష్ట్రాలలో ప్రభుత్వ ఏర్పాటుకై ఓట్లే, అధికారమే ధ్యేయంగా మితిమీరిన ఉచిత పథకాల వల్ల రాష్ట్రాల దీర్ఘకాలిక అభివృద్ధి శూన్యం, భవిష్యత్తు ప్రశ్నా ర్థకం అనే అంశంపై నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాలవాయి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్, మీడియా ఇన్చార్జి రాజు సాగర్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులు6 నుంచి 10తరగతి చదివే విద్యా ర్థులు ఈ పోటీలలో పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు అవకాశం ఉంటుం దన్నారు. సమయం 5 నిమిషాలు మండల స్థాయి/ జిల్లా స్థాయిలో ఉంటుందన్నారు. జిల్లాస్థాయి ఉపన్యాస పోటీ లని జిల్లా కేంద్రంలోని బాయ్స్ హై స్కూల్ లో 13న, ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. మొదటి బహుమతిగా రూ.5,016లు. రెండవ బహుమతిగా రూ. 3016లు. మూడవ బహుమతిగా రూ. 2016లు. నాలు గవ బహుమతిగారూ.1016లు, ఐదవ బహుమతిగా రూ. 516లు అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సంస్కరణలతోనే రాష్ట్రానికి వెలుగులు

- బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

బీఆర్ఎస్ పోరాటంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల పెంపు ముప్పు తప్పిందని, ఈ రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని బీఆర్ ఎస్ వీ కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. అలంపూర్ నియోజకవర్గం ఐజ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు.. బీఆర్ఎస్ 'విద్యుత్' విజయం సందర్భంగా కేసీఆర్, కేటీఆర్‌లకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు పార్టీ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం మోపెందుకు సిద్ధమైన 18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ఆపడంలో బీఆర్ఎస్ విజయం సాధించిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఎన్నడూ విద్యుత్ ఛార్జీలు పెంచలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 10 నెలల్లోనే 18,500 కోట్ల మేర విద్యుత్ ఛార్జిలను పెంచేందుకు ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ప్రధాన ప్రతిపక్షంగా బహిరంగ విచారణలో పాల్గొని విద్యుత్ నియంత్రణ మండలిని ఒప్పించి ఈ విద్యుత్ భారాన్ని తగ్గించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. బీఆర్ఎస్ పోరాటం వల్లనే చార్జీల పెంపు ప్రతిపాదనను ఈఆర్సీ తిరస్కరించిందని అన్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రానికి రూ.18, 500 కోట్ల విద్యుత్ భారం ముప్పు తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తొత్తినోనీదొడ్డి మాజీ సర్పంచ్ శివ కుమార్, రంగు మద్దిలేటి, టౌన్ వీరేష్, మత్తాలి, బుడగ జంగం కృష్ణ, మహేష్ గౌడ్, రాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులను.. రైతుల ఖాతాల్లో జమచేయాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు



నవతెలంగాణ - ఇటిక్యాల

రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమచేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకేపోగు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని శివనంపల్లి గ్రామంలో పార్టీకి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగాయ బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులను వ్యవసాయ రైతుల ఖాతలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. దసరా పండుగకు ముందు రోజులలోనే వ్యవసాయ రైతుల ఖాతాలలో రైతు భరోసా నిధులను జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ జమజేయలేదన్నారు. కాంగ్రెస్ ది రైతు వ్యతిరేక ప్రభుత్వ మని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను సైతం రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అధిక వర్షపాతంతో తీవ్రంగా నష్టపో యినా వ్యవసాయ రైతులు పంటలకు పెట్టు బడులు పెట్టలేక ఇంకా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల ఖాతాలలో రైతు భరోసా నిధులను జమజేయాలని కోరారు.

సీఎం కప్ క్రీడలు వాయిదా

నవతెలంగాణ - గట్టు

మండల స్థాయిలో నవంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న సీఎం కప్ క్రీడా పోటీలు వాయిదా వేసినట్టు ఎంపీడీవో చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో హౌస్ హోల్డ్ సర్వే ఉన్నందున సీఎం కప్ క్రీడా పోటీలు వాయిదా వేశామని చెప్పారు. తదుపరి పోటీలు ఎప్పుడు నిర్వహించేది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. ప్రకటిస్తామని చెప్పారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్ కుమార్



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

మైనర్ బాలిక మృతి వెనక ఉన్న కారణాలను వెలికి తీసి నిందితులను శిక్షించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ గొంగల్ల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డె రాజేశ్వరి మృతదేహాన్ని రీ పోస్టు మార్టం నిర్వహించి వాస్తవ విషయాలను బయటకు తీయాలన్నారు. రాజేశ్వరి మృతికి కారకులైన నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నేత డీకే. అరుణ ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి తరపున అండగా ఉంటామన్నారు. మల్దకల్ మండలంలోని రాజేశ్వరి మృతికి కారకులైన ప్రముఖ సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డిని తక్షణమే పోలీసులు అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. గద్వాల పట్టణంలో మైనర్ బాలికను ప్రముఖ సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డి తన ఇంట్లో పనిలో పెట్టుకుని కొన్ని రోజుల తర్వాత ఆ బాలికపై అక్రమంగా దొంగతనం కేసు మోపడంతో, ఈ ఘటన మొత్తం గద్వాల పట్టణంలో జరగగా మల్దకల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మైనర్ బాలికను ఇబ్బందులకు గురిచేసి వేధించడంతో అవమాన భారం తట్టుకోలేక పురుగుల మందు సేవించి,ఆత్మహత్యాయత్నం చేసుకున్న వడ్డే రాజేశ్వరి మృతికి కారణమైన సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డిని అదుపులోకి తీసుకోకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. స్వయానా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నమైనర్ బాలికపై శారీరకంగా అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపించిన నేపథ్యంలో దీని వెనుక ఉన్న వాస్తవ విషయాలను బయటకు తీయాలన్నారు. వడ్డే రాజేశ్వరి కుటుంబానికి న్యాయం జరగకపోతే ఈ విషయంపై త్వరలోనే రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేయటమే కాక వడ్డె రాజేశ్వరి మృతికి కారకులైన బండ్ల రాజశేఖర్‌ను అరెస్టు చేసేంత వరకు నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లాలో పెద్ద ఎత్తున జిల్లాలో ఉద్యమాలు చేసేందుకు వెనకడుగు వేయబోమని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి, వెంకట్రాములు, ప్రేమ్ రాజ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా సీనియర్ నాయకులు మిట్టదొడ్డి ఇమ్మానుయేల్, బల్గేర ముక్కరన్న



నవతెలంగాణ - గట్టు

మైనర్ బాలిక రాజేశ్వరి మృతికి కారణమైన బండ్లరాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా సీనియర్ నాయకులు మిట్టదొడ్డి ఇమ్మానుయేల్, బల్గేర ముక్కరన్నలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికీ చెందిన నిరుపేద మైనర్ బాలిక రాజేశ్వరి మృతికి కార ణమైన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. మల్దకల్ మండలం,బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక రాజేశ్వరినీ గద్వాలలో ఉన్నా ఒక ఒక అగ్రవర్ణ కులానికి చెందిన బండ్ల రాజశేఖర్ రెడ్డి పనిలో పెట్టుకొని అక్రమ దొంగతనం నేరం మోపబడి మల్దకల్ పోలీస్ స్టేషనులో కేసు పెట్టి వేధింపులకు గురి చేసినట్లు తెలి పారు. దీంతో ఆ బాలిక మనస్థాపనికి గురై పురు గుల మందు తాగి కర్నూల్ ఆసుపత్రిలో 13 రోజులు ప్రాణంతో పోరాటం చేసి మృతి చెందిందన్నారు. బాధ్యులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి తక్షణమే నింది తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా లోని ఎస్సీ ఎస్టీ, బీసీలు మేల్కొని బాలి కకు మద్దతుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

బిజినెస్

ఎగిసిన బంగారం దిగుమతులు

- ఆరు నెలల్లో 27 బిలియన్లకు చేరిక
- ఆర్‌బీఐ వద్ద పెరిగిన నిల్వలు



ముంబయి : భారతదేశ బంగారం దిగుమతులు అమాంతం పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో ఏకంగా 21.78 శాతం పెరిగి 27 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.23 లక్షల కోట్లు) విలువ చేసే పసిడి దిగుమతులు చోటు చేసుకున్నాయి. 2023-24లో ఇదే ఆరు నెలల కాలంలో 22.25 బిలియన్ల దిగుమతులు నమోదయ్యాయి. అమాంతం పెరిగిన దిగుమతులు భారత కరెంట్ ఖాతా లోటును మరింత పెంచనున్నాయి. గడిచిన ఆరు నెలల్లో వెండి దిగుమతులు కూడా భారీగానే 376.41 శాతం పెరిగి 2.3 బిలియన్లకు చేరాయి. 2023-24 ఇదే కాలంలో 480.65 మిలియన్ డాలర్ల దిగుమతుల చోటు చేసుకున్నాయి. పండుగల డిమాండ్ పసిడి, వెండి దిగుమతుల పెరుగుదలకు దోహదపడుతుందని పరిశ్రమల నిపుణుడు తెలిపారు.

దేశంలోని మొత్తం పసిడి దిగుమతుల్లో 40 శాతం వాటా స్విట్జర్లాండ్ నుంచి రావడం గమనార్హం. యుఎఇ నుంచి 16 శాతం, దక్షిణాఫ్రికా నుంచి 10 శాతం చొప్పున దిగుమతుల జరిగాయి. ప్రపంచంలో అత్యధిక బంగారం దిగుమతుల్లో చైనా అగ్రస్థానంలో ఉండగా.. భారత్ రెండో స్థానంలో ఉంది. బంగారం దిగుమతులు భారీగా పెరగడంతో 2024-25 ప్రథమార్థంలో భారత వాణిజ్య లోటు (ఎగమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) 137.44 బిలియన్ డాలర్లకు ఎగిసింది. గతేడాది ఇదే సమయంలో 119.24 బిలియన్ల లోటు చోటు చేసుకుంది. 2024 ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో అభరణాల ఎగుమతులు 10.89 శాతం తగ్గి 13.91 బిలియన్లుగా నమోదవడంతో.. ఈ రంగం వాణిజ్య లోటు 9.7 బిలియన్లకు పెరిగింది. బడ్జెట్‌లో బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో ఈ రంగం దిగుమతులు మరింత పెరిగాయి.

ఆర్‌బీఐ వద్ద 855 మెట్రిక్ టన్నుల పసిడి

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద బంగారం నిల్వలు భారీగా పెరిగాయి. 2024 మార్చి నుంచి సెప్టెంబర్ మధ్య బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషల్ సెటిల్‌మెంట్స్ నుంచి 102 టన్నుల బంగారాన్ని బదిలీ చేసుకుంది. దీంతో ఆర్‌బీఐ బంగారం నిల్వలు 855 మెట్రిక్ టన్నులకు చేరాయని ఆర్‌బీఐ తన నివేదికలో తెలిపింది. ఇందులో స్వదేశంలో 510.5 టన్నులు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద 324 మెట్రిక్ టన్నుల చొప్పున నిల్వ ఉంది. మరో 20.26 టన్నుల బంగారం డిపాజిట్ల రూపంలో తమ వద్ద ఉందని వెల్లడించింది. 2024 మార్చి ముగింపు నాటికి మొత్తం విదేశీ మారక నిల్వలలో బంగారం వాటా 8.15 శాతంగా ఉండగా.. సెప్టెంబర్ చివరి నాటికి దాదాపు 9.32 శాతానికి పెరిగింది.

కాస్ట్రోల్ ఇండియా ఎండీగా కేదార్ లేలే



హైదరాబాద్: ప్రముఖ లూబ్రికెంట్ తయారీదారు అయిన క్యాస్ట్రోల్ ఇండియా నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా కేదార్ లేలే నియమితులయ్యారు. నవంబర్ 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారని ఆ కంపెనీ తెలిపింది. హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)లో రెండు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్ తర్వాత కేదార్ కాస్ట్రోల్‌లో చేరారు. హెచ్‌యూఎల్‌లో ఆయన చివరిగా కంపెనీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. దక్షిణాసియాలోని సేల్స్ అండ్ కస్టమర్ డెవ లప్‌మెంట్‌కు బాధ్యత వహించారు. సంస్థను వృద్ధిలో నడిపించడంలో అతని అపార అనుభవం తమ సంస్థకు కలిసి రానుందని కాస్ట్రోల్ ఇండియా లిమిటెడ్ చైర్మెన్ రాకేష్ మఖిజా పేర్కొన్నారు.

బ్యాంకింగ్, ఫార్మా షేర్లలో ఒత్తిడి

సెన్సెక్స్ 427 పాయింట్ల పతనం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి కొనసాగుతోంది. బ్యాంకింగ్, ఫార్మా రంగాల్లో అమ్మకాల వెల్లువతో బుధవారం నష్టాలను చవి చూశాయి. సెన్సెక్స్ 80వేల దిగువకు పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూలతలకు తోడు దేశీయంగా ఎలాంటి సానుకూలతలు కానరాకపోవడంతో రోజంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్ 426.85 పాయింట్లు పతనమై 79,942.18కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 126 పాయింట్లు పతనమై 24,341 వద్ద ముగిసింది. ఉదయం నష్టాల్లో మొదలైన సూచీలు.. ఏ దశలోనూ కోలుకోలేదు. దాదాపు 2,787 షేర్లు లాభాల్లో కొనసాగగా.. 978 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో సిప్లా, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ట్రెంట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా కన్స్యూమర్, హీరో మోటోకార్ప్, బ్రిటానియా ఇండస్ట్రీస్, మారుతీ సుజుకీ లాభపడ్డాయి. ఎఫ్‌ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, మీడియా రంగాలు వరుసగా 0.5 నుంచి 2 శాతం పెరిగాయి. బ్యాంక్, ఫార్మా, ఐటీ ఒకశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ యథాతథంగా ముగియగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం పెరిగింది.

అమృతాంజన్ కార్యకలపాల విస్తరణ

హైదరాబాద్ : హెల్త్‌కేర్ అండ్ వెల్‌నెస్ రంగంలోని అమృతాంజన్ హెల్త్‌కేర్ తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. విజయవాడలో తమ మొదటి ఫిజికల్ స్టోర్ 'వరల్డ్ ఆఫ్ అమృతాంజన్'ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. ఈ కొత్త స్టోర్ కంపెనీ విస్తరణలో మరో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని ఆ కంపెనీ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ఎస్ శంభు ప్రసాద్ తెలిపారు. ఇది తమ వినియోగదారులకు తమ నమ్మకమైన శ్రేణీ ఉత్పత్తులను తీసుకురావాలనే నిబద్ధతను ప్రదర్శిస్తుందన్నారు. ఇతర వ్యూహాత్మక ప్రదేశాలలోనూ కొత్త స్టోర్‌లను ప్రారంభించే యోచనలో ఉన్నామన్నారు.

అమేజాన్ ఫ్రెష్ లో దీపావళి సూపర్ వేల్యూ డేస్

బెంగళూరు: దీపాల పండగ నేపథ్యంలో, అమేజాన్ ఫ్రెష్ 1 నుండి 7 నవంబర్ 2024 వరకు ఫెస్టివ్ సూపర్ వేల్యూ డేస్ని అందిస్తోంది. వివిధ ఆదాలతో గొప్ప డీల్స్ అందిస్తోంది. సంప్రదాయబద్ధమైన మిఠాయిలు, తాజా పండ్లు, కూరగాయలు, స్నాక్స్, పానియాలు, మిఠాయిలు, నిత్యావసరాలు సహా విస్తృత శ్రేణి ఉత్పత్తులపై 45% వరకు తగ్గింపును అందిస్తోంది. సమయానికి సౌకర్యవంతమైన ఇంట ముంగిట డెలివరీలతో ఆశీర్వాద్ బికాజీ, పార్లే, దావత్, టాటా సంపన్, డెట్టాల్ వంటి నమ్మకమైన బ్రాండ్స్ కోసం అమేజాన్ ఫ్రెపై షాపింగ్ చేసి సులభంగా సంబరాలు చేసుకోవచ్చు. ప్రైమ్ సభ్యులు అమేజాన్ ఫ్రెష్ ఫెస్టివ్ సూపర్ వేల్యూ డేస్తో అతుల్యమైన ఆదాల ప్రయోజనాలను అత్యధికంగా పొందవచ్చు. ఇప్పటికే ప్రైమ్ కస్టమర్లగా ఉన్న వారు 45% వరకు తగ్గింపును, ఫ్లాట్ రూ.300 క్యాష్ బాక్కు, ఉచిత డెలివరీలు, పండ్లు, కూరగాయలపై అదనంగా రూ.50 క్యాష్ బాక్ 1 నుండి 3 నవంబర్ వరకు పొందవచ్చు.

రైతులకు గోద్రెజ్ రాషిన్బాన్ భరోసా



హైదరాబాద్: మిరప మొక్కలో కీలకమైన ఆర్థిక భాగమైనందున, మిరప సాగులో పువ్వులు విజయానికి అత్యంత కీలకం. ఈ కీలకమైన వాస్తవాన్ని గుర్తించి, ఈ కీలకమైన మొక్కల నిర్మాణాలను రక్షించే శాస్త్రీయ పరిష్కారాలను రైతులు స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూత సమయం అంటే రాషిన్బాన్ సమయం అని జీఏవిఎల్, క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ - సీఈఓ ఎన్ కె రాజవేలు పేర్కొన్నారు. పురుగుమందుల అశాస్త్రీయ కలయికలు పంటలను, పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఇది పంట దిగుబడిని ప్రభావితం చేయడమే కాకుండా వారి పొలాల సున్నితమైన పర్యావరణ సమతుల్యతను కూడా దెబ్బతీస్తుంది. ఈ సమస్యలను రాషినా ్ఫన్ పరిష్కరిస్తుంది. పంట నాటిన 45-75 రోజుల వద్ద రాషిన్బన్ ఉపయోగించినప్పుడు, సమర్థవంతమైన పరిష్కారాన్ని అందిస్తుంది. ఇది ఒక సారి వినియోగిస్తేనే తామర పురుగు (త్రిప్స్), లెపిడోప్టెరాన్స్, పచ్చ దోమ (హాప్పర్స్), నల్లి (మైట్స్)తో సహా అనేక రకాల కీటకాలను నాశనం చేస్తుంది.

మెరిల్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రధాని

అహ్మదాబాద్ : గ్లోబల్ మెడ్‌టెక్ కంపెనీ మెరిల్ పీఎల్ఐ పథకం కింద ఏర్పాటు చేసిన అధునాతన తయారీ కేంద్రాన్ని ప్రధాని నరేంద్ర మోడీ వర్చ్యువల్‌గా ప్రారంభించారు. వాపిలోని మెరిల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని సహా ఆ రాష్ట్ర సిఎం భూపేందర్‌భాయ్ పటేల్ హాజరయ్యారని ఆ కంపెనీ తెలిపింది. భారత్‌లో ఇప్పటి వరకు రూ.1,400 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టామని మెరిల్ తెలిపింది.

హారిస్ వైపే భారతీయ అమెరికన్ల మొగ్గు

- 2020తో పోలిస్తే తగ్గిన మద్దతు
- తాజా సర్వేలో వెల్లడి



వాషింగ్టన్ : డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌వైపే భారతీయ అమెరికన్లు మొగ్గు చూపుతున్నారని తాజా సర్వేలో వెల్లడైంది. 61 శాతం మంది హారిస్‌కే ఓటు వేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 31 శాతం మంది ట్రంప్‌కు మద్దతిస్తున్నారు. యుగవ్‌తో కలిసి కార్నేజ్ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ నిర్వహించిన ఇండియన్ అమెరికన్ యాటిట్యూడ్స్ సర్వే (ఐఎఎఎస్) 2024లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ సర్వే వివరాలను సోమవారం ప్రచురించారు. అయితే డెమోక్రాట్లకు ఆందోళన కలిగించే అంశాలు కూడా కొన్ని వున్నాయి.

2020తో పోలిస్తే డెమోక్రటిక్ అభ్యర్థికి భారతీయ అమెరికన్ల మద్దతు కొంచెం తగ్గిందనే చెప్పాల్సి వస్తుందని సర్వే పేర్కొంటోంది. ఆనాడు 68శాతం మంది జో బైడెన్‌కు మద్దతిచ్చారు. ఇప్పుడు డెమోక్రటిక్ పార్టీకి మద్దతు 61 శాతానికి పడిపోయింది. అలాగే నాలుగేళ్ళ నాడు ట్రంప్‌కు 22 శాతమే మద్దతు రాగా, ఇప్పుడు అది 31 శాతానికి పెరిగింది. తాము డెమోక్రాట్లమని చెప్పుకునే ఇండియన్ అమెరికన్స్ సంఖ్య కూడా 56 శాతం నండి 47 శాతానికి క్షీణించింది. అలాగే డెమోక్రాట్లవైపు మొగ్గుచూపే వారి సంఖ్య కూడా 66 శాతం నుండి 57 శాతానికి పడిపోయింది.

40 ఏళ్లలోపు వయస్సు వున్న ఇండియన్ అమెరికన్ పురుషుల్లో 48 శాతం మంది ట్రంప్‌తో వున్నారు. హారిస్ వైపు 44 శాతం మందే వున్నారు. అమెరికా ఎన్నికల చరిత్రలో రిపబ్లికన్ అభ్యర్థికి యువ భారతీయ పురుషులు మద్దతు పెరగడం ఇదే మొట్టమొదటిసారి. భారత్‌లో జన్మించి, అమెరికాలో స్థిరపడిన వారితో పోల్చుకుంటే అమెరికాలో జన్మించిన భారతీయ సంతతి వర్గాల్లో కూడా ట్రంప్‌కే మద్దతు ఎక్కువగా వుంది.

ఇండియన్ అమెరికన్ ఓటర్లలో దేశ ఆర్థిక పరిస్థితుల పట్ల ఆందోళనల తర్వాత రెండో ప్రధానమైన అంశంగా అబార్షన్ హక్కులు వుంది. డెమోక్రటిక్ పార్టీ కీలక ప్రచారంశం కూడా ఇదే. ట్రంప్‌కు వున్న మద్దతుతో పోల్చుకుంటే అన్ని వయస్సుల మహిళా ఓటర్లు కూడా హారిస్ వైపే మొగ్గు చూపుతున్నారని సర్వే వెల్లడిస్తోంది. అలాగే పురుషుల్లో కూడా ఈ చీలిక కనిపిస్తోంది. వృద్ధులైన ఓటర్లు హారిస్‌కే మద్దతిస్తున్నారు. నాలుగేళ్ళనాటితో పోల్చుకుంటే దేశీ ఓటర్లు కూడా ఎక్కువమంది వామపక్షం వైపు మొగ్గు చూపుతున్నారు.

జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీకి చెందిన దేవేష్ కపూర్, కార్నేజ్ ఎండోమెంట్‌కి చెందిన మిలాన్ వైష్ణవ్, అమెరికన్ యూనివర్శిటీకి చెందిన సుమిత్రా బదరినాథన్‌లు ఈ సర్వే నిర్వహించారు. సెప్టెంబరు రెండో వారం నుండి అక్టోబరు రెండో వారం వరకు 714 మంది ఇండియన్ అమెరికన్‌లను వీరు సర్వే చేశారు. 2020లో కూడా ఇదే రీతిలో సర్వే జరిగింది. ఇండియన్ అమెరికన్స్‌లో రాజకీయ, సామాజిక వైఖరులను పరిశీలించే రీతిలో జరిగిన మొట్టమొదటి సర్వే అది. హారిస్‌కు మద్దతిస్తున్న వారిలో మొదటి స్థానంలో ఆఫ్రికన్ అమెరికన్స్ వున్నారు. వీరు 77 శాతంగా వున్నారు. ఆ తర్వాత ఇండియన్ అమెరికన్స్ 61 శాతంగా వున్నారు. 58 శాతం మంది హిస్పానిక్స్, 41 శాతంమంది శ్వేత జాతీయుల మద్దతు హారిస్‌కు వుంది. అలాగే వామపక్ష భావజాలం వైపు మొగ్గు చూపుతున్న వారిలో హారిస్‌కు మద్దతిచ్చే వారి సంఖ్య 47 నుండి 55 శాతానికి పెరిగింది.

దేశవ్యాప్తంగా 52లక్షల మంది భారతీయ మూలాలు కలిగిన వారు అమెరికాలో వున్నారు. వారిలో 26లక్షల మంది అమెరికన్ పౌరులు గానే సర్వే అంచనా వేసింది. అమెరికాలో రెండో అతిపెద్ద వలస సమూహంగా ఇండియన్ అమెరికన్స్ వున్నారు. మొదటి స్థానం మెక్సికన్ అమెరికన్స్. ఈ నేపథ్యంలో ఇండియన్ అమెరికన్స్ కీలకమైన ఓటింగ్ సమూహంగా మారారు. వీరిలో 96శాతంమంది ఓటర్లే. వారి ప్రధాన ఆదాయం వార్షికంగా 1,53,000 డాలర్లుగా వుంది. అంటే జాతీయ సగటుకన్నా రెట్టింపు అని సర్వే పేర్కొంది. వారి రాజకీయ ప్రభావం కూడా పరిగణనలోకి తీసకునే రీతిలోనే వుంది. హారిస్ నామినేషన్ సమయంలో ఆ అంశం బాగా కనిపించింది. ఆర్థిక, వ్యాపార, విద్యా, వైద్య రంగాల్లో కూడా వీరు వుండడంతో ప్రజా జీవనంలో వారి ప్రాబల్యం ఎక్కువగానే వుంది. పైగా డోలాయమానం అధికంగా వుండే రాష్ట్రాల్లో వీరు ప్రధానంగా వుండడం మరో కీలకాంశం.

భారత్‌లో ప్రమాదకరమైన, కష్టతరమైన ఆర్థిక పరిస్థితి : జైరాం రమేష్

న్యూఢిల్లీ : భారత్ చాలా సంవత్సరాలుగా అత్యంత ప్రమాదకరమైన, కష్టతరమైన ఆర్థిక పరిస్థితిలో ఉందని కాంగ్రెస్ పేర్కొంది. వేతనాల్లో అనిశ్చితి, ద్రవ్యోల్బణం మరియు అసమానతలు దేశంలో వినియోగ వృద్ధిని దెబ్బతీస్తున్నాయని తెలిపింది. ఈ చెక్‌పాయింట్లను సీరియస్‌గా తీసుకోకుంటే రాబోయే సంవత్సరాలలో వృద్ధిని అడ్డుకుంటాయని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ పేర్కొన్నారు.

గత మూడు దశాబ్దాలుగా భారతదేశ వృద్ధి వినియోగ వృద్ధిలో పెరుగుదల ఉందని, కోట్లాది కుటుంబాలు పేదరికాన్ని అధిగమించి మధ్యతరగతిలోకి ప్రవేశించారని అన్నారు. కొత్తగా ఉత్పత్తులను కొనుగోలు చేయగలరు, ఆస్తులను పొందగలరు అని అన్నారు. ఇది ఆర్థిక వృద్ధికి నిదర్శనమని, వేగంగా అభివృద్ధి చెందుతున్న, దాని లాభాలను విస్తృతంగా పంపిణీ చేస్తుందని చెప్పారు.

అయితే గత పదేళ్లలో, భారతదేశ వినియోగ కథ ఇప్పుడు తిరోగమనంలో ఉందని, భారత ఆర్థికవ్యవస్థకు అతిపెద్ద అడ్డంకులుగా మారాయని అన్నారు. భారతదేశంలో మధ్యతరగతి కుచించుకు పోతుందని అన్నారు. ఆర్థిక వృద్ధి క్షీణించడానికి వేతనాల్లో స్తబ్దత, అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలని పేర్కొన్నారు. ఇటీవల విడుదల చేసిన పరిశ్రమల వార్షిక అధ్యయనం (ఎఎస్ఐ) 2022-2023 ప్రభుత్వ అధికారిక గణాంకాలతో పాటు పలు సర్వేలు పేర్కొంటున్నాయని అన్నారు. కార్మికులు పది సంవత్సరాల క్రితం కంటే ఈ రోజు తక్కువ కొనుగోలు చేయగలుగుతున్నారని స్పష్టమైన ఆధారాలు చూపుతున్నాయని అన్నారు.

ఈ వేతనాల్లో స్తబ్దత భారత్‌లోని కార్మికుల ఉత్పాదకత క్షీణతకు కారణం కావచ్చు. కార్మిక ఉత్పాదకత పడిపోవడం, నిజమైన వేతనాలు స్తబ్దుగా ఉండటంతో కుటుంబాల వినియోగానికి అతి తక్కువ ఆదాయన్ని వెచ్చిస్తారని అన్నారు.

2015లో ఓ సాధారణ వ్యక్తి రూ.100ను కొనుగోళ్లకు వెచ్చిస్తే.. దానిలో 18 శాతం పరిశ్రమల యజమానికి చెల్లించేవాడు. కానీ నేడు. అదే యజమానికి లాభాలలో రూ.36 చెల్లిస్తున్నాడని అన్నారు. వస్తువుల మరియు సేవల ధరల్లో తీవ్రమైన పెరుగుదల కొనుగోళ్లను పెంచే సామాన్యుని సామర్థ్యాన్ని, ప్రత్యేకించి స్తబ్దుగా ఉన్న వేతనాలను తగ్గించిందని అన్నారు.

ఆర్థిక వృద్ధికి ప్రధాన సూచిక అయిన గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల అమ్మకాలు 2018తో పోలిస్తే తక్కువగానే ఉన్నాయని అన్నారు.



దీపావళికి పటాకులు పేల్చొద్దు : అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దీపావళి పండుగకి పటాకులు పేల్చవద్దని ఢిల్లీవాసులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. 'దీపావళి అంటేనే వెలుగుల పండుగ. అయితే ఈ పండుగరోజున బాణాసంచా కాల్చితే ఏర్పడే కాలుష్యం వల్ల ఢిల్లీవాసులు, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఈ ఆంక్షలు కేవలం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నంలో భాగమే. కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని పటాకులు పేల్చకూడదని సుప్రీంకోర్టు, హైకోర్టు కూడా చెబుతున్నాయి. ఇది వెలుగుల పండగే కానీ. పటాకుల్ని కాల్చి కాలుష్యాన్ని పెంచే పండగ కాదు. పటాకులు కాల్చడం వల్ల మనకెవరికీ మేలు జరగదు. మన కోసం, మన కుటుంబం కోసం... మనం ఏం చేస్తున్నాం అన్నది ఆలోచించాలి. ఏ కాలుష్యం వచ్చినా.. మన పిల్లలు బాధపడతారు. ఇక్కడ హిందూ ముస్లిం అనే తేడా లేదు. ప్రతి ఒక్కరి జీవితం ముఖ్యమే' అని ఆయన అన్నారు.

ఫ్రెంచ్ రాయబారి ఫోన్ దొంగతనం

- నలుగురు అరెస్టు

న్యూఢిల్లీ : ఫ్రెంచ్ రాయబారి డాక్టర్ థియరీ మాథౌ మొబైల్ ఫోన్ దొంగిలించిన కేసులో నలుగురు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. భారత్ పర్యటనకు వచ్చిన డాక్టర్ మాథౌ, అతని భార్య ఈ నెల 20న ఢిల్లీలోని చాందినీ చౌక్ ప్రాంతంలో జైన్ మందిర్ సమీపంలో దీపావళి మార్కెట్‌ను పరిశీలిస్తున్న సమయంలో మొబైల్ ఫోన్‌ను దొంగిలించారు. కాగా, తన ఫోన్ పోగొట్టుకున్నట్లు డాక్టర్ మాథౌ ఇ- ఫిర్యాదు దాఖలు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు... ఆ ప్రాంతంలోని సిసిటీవీ ఫుటేజీ సహాయంతో నలుగురుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. నిందితులనుంచి దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పాలస్తీనియన్ల నిర్మూలన కోసం ఇజ్రాయిల్ యత్నం

- ఐరాస ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సెస్కా

ఐరాస : తమ భూభాగం నుండి పాలస్తీనియన్ల నిర్మూలన కోసం ఇజ్రాయిల్ యత్నిస్తోందని ఐరాస ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సెస్కా అల్బనీస్ పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం చేస్తోందని పునరుద్ఘాటించా రు.ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడా రు. "ఈ రోజు, పాలస్తీనియన్ల మారణహోమం ముగింపుకు మార్గంగా కనిపిస్తోంది. పాలస్తీనియన్లను, వారి గుర్తింపును భూమి నుండి పూర్తిగా తుడిచిపెట్టడం లేదా నిర్మూలించడం ఇజ్రాయిల్ చట్టవిరుద్ధంగా, బహిరంగంగా కోరుకుంటోంది" అని అన్నారు. గాజాలో ప్రజలకు సాయమందించే ఐక్యరాజ్య సమితి ప్రధాన సంస్థ కార్యకలాపా లకు ముప్పు వాటిల్లేలా ఇజ్రాయిల్ సోమ వారం రెండు చట్టాలను ఆమోదించిన సంగతి తెలిసిందే. మొదటి చట్టం ప్రకారం పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐరాస సంస్థ యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎపై నిషేధం విధించారు.ఇజ్రాయిల్ భూభాగంలో ఎలాంటి చర్యలు లేదా సేవలు నిర్వహించరాదు. రెండో చట్టం కింద దానితో దౌత్య సంబంధాలను తెగతెంపులు చేసుకోవాల్సి వుంటుంది. గాజాపై ఇజ్రాయిల్ మారణహోమంలో ఇప్పటివరకు 43,050 మంది మరణించారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు.

2013 భూ సేకరణ చట్ట ప్రకారం కూలీలకూ పరిహారమివ్వాలి

నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) ధర్నా



నవతెలంగాణ-జహీరాబాద్

నిమ్జ్ భూ బాధితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని, దీన్ని కూలీలకు వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ఆర్డీవో, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో, పరిపాలనా అధికారి వంశీకృష్ణ, నిమ్జ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.రాంచందర్ మాట్లాడుతూ.. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కూలీలందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిమ్జ్ పరిధిలో పునరావాసం కల్పించాలన్నారు. కూలీలకు న్యాయం చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పలు దఫాలుగా విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టులో కేసులు వేయగా.. కూలీలకు పునరావాసం కల్పించాలని కోర్టు ఆదేశాలివ్వగా, దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అంగీకరించిందన్నారు. కాగా ప్రస్తుతం పరిశ్రమలు పెట్టడానికి చురుకుగా ప్రయత్నాలు జరుగుతు న్నాయని.. కోర్టు ఆదేశాల ప్రకారం ముందు కూలీలకు పునరావాసం కల్పించిన తర్వాతనే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కూలీలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్నారు. వెంటనే దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. శంకర్, మనోహర్, జయమ్మ, బలప్ప,

వజ్రాల వ్యాపారి సావ్జీ ఇంట్లో

పెండ్లికి ప్రధాని మోడీ



అహ్మదాబాద్ : గుజరాత్ వజ్రాల వ్యాపారి ఇంట్లో జరిగిన వివాహ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీపావళి సమయంలో తమ వద్ద పని చేసే ఉద్యోగులకు భారీగా కానుకలు ఇచ్చే వజ్రాల వ్యాపారి సావ్జీ ధోలాకియా కుమారుడు ద్రవ్య ధోలాకియా వివాహం ఇటీవల జరిగింది. ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రధాని మోడీ వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. ద్రవ్య, జాన్వి వివాహ బంధంతో ఒక్కటైన సందర్భంగా ప్రధాని హాజరుకావడం గొప్ప ఆశీర్వాదంగా భావిస్తున్నాం' అని సావ్జీ ఒక వీడియోను పోస్టు చేశారు. గుజరాత్‌లోని అమ్రేలి జిల్లా దుధాలా గ్రామంలో 1962 ఏప్రిల్ 12న ఓ రైతు కుటుంబంలో జన్మించిన సావ్జీ ధోలాకియా

చిన్నప్పటి నుంచి చదువు అంతంత మాత్రమే. అందుకే 13 ఏళ్ల వయసులో 4వ తరగతితోనే చదువు ఆపేశారు. తన మేనమామ దగ్గర వజ్రాల పాలిషింగ్ వర్క్ నేర్చుకున్న ఆయన.. వజ్రాల వ్యాపారం మొదలుపెట్టారు. 1992లో ముంబయిలో శ్రీ హరికష్ణ ఎక్స్‌పోర్ట్స్ పేరుతో వజ్రాల ఎగుమతులను కూడా ప్రారంభించారు. ఆ తర్వాత వెనక్కి చూసుకునే అవసరం రాలేదు. ఏటా సిబ్బంది కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కానుకలు అందిస్తూ ఆయన విశేష ప్రాచుర్యం చూరగొన్న సంగతి తెలిసిందే. ఆయన సేవలకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందజేసింది.

సల్మాన్‌కు మళ్లీ బెదిరింపులు

- రూ.2 కోట్లు ఇవ్వకపోతే చంపేస్తామంటూ హెచ్చరిక



ముంబయి: బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు వరుస బెదిరింపులు వస్తున్నాయి. తాజాగా గుర్తుతెలియని ఓ వ్యక్తి నుంచి ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు సందేశం వచ్చింది. రూ.రెండు కోట్లు చెల్లించకపోతే.. సల్మాన్‌ను చంపేస్తామని బెదిరించినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే తరహాలో ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఇటీవల ఓ ఆగంతకుడి నుంచి సందేశం వచ్చిన విషయం తెలిసిందే. 'ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్‌ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5 కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ (ఇటీవల హత్యకు గురైన) కంటే దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని అగంతకులు పంపిన సందేశంలో బెదిరించారు. అనంతరం అతడు మరో సందేశం పంపించాడు. 'నేను కావాలని బెదిరింపులకు పాల్పడలేదు. అనుకోకుండా జరిగిపోయింది. క్షమించండి" అని పేర్కొన్నాడు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు పలు బందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఝార్ఖండ్ పోలీసుల సాయంతో జంషెడ్‌పూర్ చెందిన ఓ కూరగాయల వ్యాపారి ఇదంతా చేసినట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

కాగా కృష్ణజింకలను వేటాడిన కేసు నేపథ్యంలో ఇప్పటికే పలుమార్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు ఎదురయ్యాయి. ఆయన స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ ఇటీవల దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే.

ట్రుడోకు మిత్రపక్షం నుంచి ఎదురుదెబ్బ

- ప్రతిపక్షంతో జట్టుకట్టిన క్యూబెక్ పార్టీ



ఒట్టావా : కెనడా పార్లమెంటు ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడోకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామ్యపక్షం నుంచి ట్రూడోకు వ్యతిరేకత ఎదురైంది. తాజాగా క్యూబెక్ పార్టీ ప్రతిపక్షంతో జట్టుకట్టింది. ఈ మేరకు స్థానిక మీడియా కథనాలు వెలువరించింది. వృద్ధుల భద్రత కోసం తాము చేసిన సూచనలను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని క్యూబెక్ పార్టీ ఆరోపిస్తోంది. దీంతో ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నామని ప్రకటించింది. ప్రజల సంక్షేమం కోసమే ప్రతిపక్షంతో కలిసి పనిచేస్తామని తెలిపింది. 'వద్ధుల భద్రత కోసం వారికి చెల్లింపులను పెంచాలనే డిమాండ్‌ను ట్రూడో ప్రభుత్వానికి ప్రతిపాదించాం. దానికి గడువు కూడా విధించాం. కానీ, దాన్ని నెరవేర్చడంలో విఫలమైంది' అని క్యూబెక్ పార్టీ నేత ఒకరు పేర్కొన్నారు. కెనడా పార్లమెంట్‌లో 338 స్థానాలు ఉండగా.. ట్రూడో లిబరల్ పార్టీకి 153 మంది సభ్యులు ఉన్నారు. ప్రధాని మిత్రపక్షాల మద్దతుతో ఇన్నాళ్లు ప్రభుత్వాన్ని నెట్టుకొచ్చారు. అయితే.. ఆయన తీరుపై స్వపక్షంలోనే అసంతప్తి వ్యక్తమవుతోంది. ట్రూడో రాజీనామా చేయాలంటూ 24 మంది లిబరల్ సభ్యులు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మైనార్టీలో ఉన్న ప్రభుత్వానికి భాగస్వామ్య పక్షమైన క్యూబెక్ పార్టీ తీసుకున్న నిర్ణయం మరింత సవాలుగా మారింది.

ఏపీ భవన్ రీ డెవలప్‌మెంట్ డిజైన్లకు టెండర్లు ఆహ్వానం

- నవంబరు 28లోపు ప్రతిపాదనలు సమర్పించాలని నోటిఫికేషన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది. 'రీ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ భవన్' పేరుతో డిజైన్లకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర విభజన తరువాత ఢిల్లీ ఎపి భవన్ విభజన చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు రెండు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజన ఖరారు చేశారు. రెండు రాష్ట్రాల అధికారుల ప్రతిపాదనకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న భవనాలను రెండు రాష్ట్రాలు వినియోగించుకుంటున్నాయి. కొత్త భవన్ నిర్మాణం చేపట్టాల్సి రావడంతో డిజైన్ల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం మొదలుపెట్టింది. ప్రస్తుతం గోదావరి, స్వర్ణముఖి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడి హౌస్ మూడు చోట్ల నిర్మాణానికి డిజైన్లు ఆహ్వానించింది. మూడు ప్రదేశాల్లో కలిపి మొత్తం 11.53 ఎకరాల్లో ఎపి భవన్ నిర్మాణానికి డిజైన్లు కోరింది. ఆసక్తి ఉన్న గుత్తేదారులు తమ 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్'ను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. నవంబరు 28లోపు ప్రతిపాదనలు సమర్పించాలని నోటిఫికేషన్‌లో రహదారులు, భవనాలశాఖ విజయవాడ సర్కిల్ ఎస్ఈ స్పష్టం చేసింది.

ఢిల్లీలో దిగజారిన వాయుకాలుష్యం

న్యూఢిల్లీ : ఢిల్లీలో గాలి నాణ్యత పడిపోయింది. బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఎక్యూఐ 300 పైనే నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ఇక ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఆనంద్ విహార్‌లో 351, బవానాలో 319, అశోక్ విహార్ ప్రాంతంలో 351, వాజీపూర్‌లో 327గా ఎక్యూఐ నమోదైంది. అయా నగర్‌లో 290 వద్ద ఎక్యూఐ నమోదైంది. గాలి నాణ్యతలు పడిపోవడంతో ఢిల్లీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

1400 మంది ఉద్యోగులపై వీసా వేటు

వాషింగ్టన్ : డిజిటల్ చెల్లింపుల సంస్థ 'వీసా' ఈఏడాది చివరినాటికి 1400 మంది ఉద్యోగులను, కాంట్రాక్టర్లను తొలగించాలని యోచిస్తోంది. అంతర్జాతీయ వ్యాపార క్రమబద్ధీకరణలో భాగంగా తొలగింపులు చేపడుతున్నట్లు మంగళవారం వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో పేర్కొంది. సాంకేతిక స్థానంలో దాదాపు వెయ్యికిపైగా కోతలు ఉండే అవకాశం ఉందని సంబంధిత వ్యక్తి పేర్కొన్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఇతర తొలగింపులు వీసా వ్యాపార అమ్మకాలు మరియు భాగస్వామ్య ఉద్యోగులపై ఉండనున్నట్లు నివేదిక తెలిపింది. గతేడాది ఆర్థిక సవంత్సరం చివరలో వీసా 28,800 మంది ఉద్యోగులను నియమించుకుంది.